RNI : APTEL / 2023 / 89152

షణ్ముఖ

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు    తెలుగు దినపత్రిక

1 St Year Happy Work Anniversary.

Good for Health  Best for Readers  THE POWER OF PEN RK

సంపుటి : 2  సంచిక : 48  ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్  గురువారం 6 ఫిబ్రవరి 2025  పేజీలు 8  : వెల 5/-  ఒంగోలు

VOLUME : 02 ISSUE : 47 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Thursday 6 February 2025 PAGES : 8 PRICE : 5/-




## పవన్ కల్యాణ్‌కు అస్వస్థత

విశాంత్రిలో పవన్ కళ్యాణ్..

వైరల్ ఫీవర్ తో బాధపడుతున్న పవన్

స్పాండిలైటిస్ కూడా బాధపెడుతోందని తెలిపిన డిప్యూటీ సీఎం కార్యాలయం

రేపటి కేబినెట్ మీటింగ్ కు హాజరుకాకపోయే అవకాశం

**అమరావతి**

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అస్వస్థతకు గురయ్యారు. ఆయన వైరల్ ఫీవర్ తో బాధపడుతున్నారని డిప్యూటీ సీఎం కార్యాలయ అధికారులు ప్రకటించారు. వైరల్ ఫీవర్ తో పాటు స్పాండిలైటిస్ కూడా ఆయనను బాధపెడుతోందని వెల్లడించారు. వైద్యుల సూచన మేరకు విశ్రాంతి తీసుకుంటున్నారని చెప్పారు. అస్వస్థత నేపథ్యంలో రేపు జరిగే కేబినెట్ భేటీకి హాజరుకాకపోవచ్చని తెలుస్తోంది. మరోవైపు పవన్ తాజా చిత్రం 'హరిహర వీరమల్లు' చివరి షెడ్యూల్ ఈరోజు ప్రారంభమయినట్టు తెలుస్తోంది. అయితే, అనారోగ్య కారణాల నేపథ్యంలో షూటింగ్ లో ఆయన పాల్గొనలేకపోవచ్చు. ఆయన వైరల్ ఫీవర్‌తోపాటు స్పాండిలైటిస్‌తో - మిగతా3లో

# ఢిల్లీ టూర్‌లో మంత్రి లోకేష్ బిజీ



- కేంద్రం సహకారంతో రాష్ట్రం పురోగతి
- ఏపీలో డిఫెన్స్ క్లస్టర్ ఏర్పాటు చేయాలని కోరిన మంత్రి
- కేంద్రమంత్రి రాజ్ నాథ్ సింగ్‌తో మంత్రి లోకేశ్ భేటీ
- ఢిల్లీలోని మంత్రి రాజ్ నాథ్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన లోకేశ్
- అప్పుల్లో మునిగిన ఏపీకి కేంద్రం అన్ని విధాల సహకరిస్తూ ఆక్సిజన్ అందిస్తోందని వ్యాఖ్య
- రాష్ట్ర అభివృద్ధి కోసం అవసరమైన సహాయాన్ని ఇస్తామని లోకేష్‌కు హామీ ఇచ్చారు

**న్యూఢిల్లీ**

ఢిల్లీ టూర్‌లో బిజి బిజీగా ఉన్నారు మంత్రి నారా లోకేష్. కేంద్ర బడ్జెట్ ఐపోవడంతో నిధులు, ప్రాజెక్టులు రాబట్టేందుకు తీవ్రంగా ఫోకస్ చేస్తోంది చంద్రబాబు సర్కార్. ఈ క్రమంలో మంత్రి నారా లోకేష్ ఢిల్లీ పర్యటనకు శ్రీకారం చుట్టారు. కేంద్రమంత్రులతో నిత్యం సమావేశమవుతూ రాష్ట్రానికి రావాల్సిన దానిపై చర్చిస్తున్నారు. ఏపీ ఐటీ, విద్య, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్‌తో ఢిల్లీలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో అభివృద్ధి కార్యాచరణలు, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చేపట్టిన కార్యక్రమాలను రాజ్ నాథ్ సింగ్‌కి - మిగతా3లో



## కుంభమేళలో మోడీ స్నానం

- అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుకకు ప్రధాని
- త్రివేణి సంగమంలో మోదీ పుణ్య స్నానం!
- స్నాన అనంతరం ప్రత్యేక పూజలు
- మోదీ పర్యటన నేపథ్యంలో భారీ భద్రతా ఏర్పాట్లు
- మహా కుంభమేళా ప్రారంభమైన తర్వాత ప్రధాని మోదీ సందర్శించడం ఇదే తొలిసారి.

## ఢిల్లీ పీఠం ఆ పార్టీదే

- పలు నియోజకవర్గాల్లో ఆప్, బీజేపీ అభ్యర్థుల మధ్య టఫ్ ఫైట్
- గెలుపుపై అటు బీజేపీ, ఇటు ఆప్ నేతలు ధీమా
- మోదీకి 'జై' కొట్టిన ఢిల్లీ ఓటర్లు..
- బీజేపీదే విజయం అంటున్న మెజార్టీ ఎగ్జిట్ పోల్స్!
- ముగిసిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్
- బీజేపీ ప్రభుత్వం ఏర్పడుతుందంటున్న ఎగ్జిట్ పోల్స్
- బీజేపీకి 51 నుంచి 60 సీట్లు రావచ్చని పీపుల్స్ పల్స్ అంచనా



## భారత్ చేరుకున్న వలసదారుల విమానం

- అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపుతున్న ట్రంప్ సర్కార్
- చట్టవిరుద్ధంగా దేశంలో ఉంటున్న భారతీయులను వెనక్కి పంపిన అమెరికా
- 205 మంది భారతీయులతో టెక్సాస్ నుంచి అమృత్‌సర్ చేరుకున్న విమానం






## ఇకపై ఛాట్ జీపీటీ, డీప్ సీక్ వాడకాన్ని ఆపాలి

- అన్ని మంత్రిత్వ శాఖలు, విభాగాల్లో పనిచేసే ప్రభుత్వ ఉద్యోగులు ఇకపై ఏఐ సాధనాలను ఉపయోగించటం మానుకోవాలి
- ఇక ఇప్పటికే భారత ప్రభుత్వం సొంత ఏఐ సాంకేతిక పరిజ్ఞానాన్ని రూపొందించేందుకు సన్నాహాలు
- ఆర్థికశాఖ ఆదేశించినట్లు పలు జాతీయ మీడియా కథనాలు
- ఇప్పటికే ఇటలీ, ఆస్ట్రేలియా వంటి కొన్ని దేశాలు చైనాకు చెందిన డీప్ సీక్ వాడకంపై నిషేధాజ్ఞలు జారీ

## మళ్లీ అధికారంలోకి వస్తాం..

# 30 ఏళ్లు ఏలుతాం

- జగన్ 2.0ని చూస్తారు.. ఎవరినీ వదిలిపెట్టను
- కార్యకర్తలను ఇబ్బంది పెడుతున్న వాళ్లని వదిలిపెట్టేది లేదన్న జగన్
- ఎవరికి ఏ కష్టం వచ్చినా తనను గుర్తుకుతెచ్చుకోవాలని సూచన
- చంద్రబాబును నమ్మడమంటే చంద్రముఖిని లేపడమేనని ఎప్పుడో చెప్పానన్న జగన్
- ప్రజలను చంద్రబాబు మోసం చేశారని విమర్శ
- టీడీపీ నేతలకు ప్రజల వద్దకు వెళ్లే పరిస్థితి లేదని వ్యాఖ్య



**అమరావతి**

ఈసారి జగన్ 2.0ని చూస్తారని... కార్యకర్తల కోసం జగన్ ఎలా పని చేస్తాడో చూపిస్తానని వైసీపీ అధినేత జగన్ అన్నారు. తొలి విడతలో ప్రజల కోసం పని చేశానని... ఆ క్రమంలో కార్యకర్తలకు ఎక్కువ ప్రాధాన్యతను ఇవ్వలేకపోయా నని చెప్పారు. కూటమి ప్రభుత్వంలో వైసీపీ కార్యకర్తలను ఇబ్బంది పెడుతున్న వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. జగన్ 1.0లో కార్యకర్తలకు అంతగా చేసుండక పోవచ్చని... జగన్ 2.0లో వేరుగా ఉంటుందని చెప్పారు. విజయవాడ వైసీపీ కార్పొరేటర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బతుకుతోందని.. ఈ రాష్ట్రాన్ని 30 ఏళ్ల పాటు ఏలుతోందని ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ జోస్యం చెప్పారు. అయితే పార్టీ - మిగతా3లో




# మళ్లీ అధికారంలోకి వస్తాం.. 30 ఏళ్లు ఏలుతాం

-మొదటిపేజీ తరువాయి

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు బెదిరిస్తారు.. దొంగ కేసులు పెడతారు.. అలాగే జైల్లో సైతం పెడతారని.. అయినా రెట్టించిన ఉత్సాహంతో పని చేస్తామని వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ స్పష్టం చేశారు. మీకు మంచి చేసిన వారినీ.. అలాగే చెడు చేసిన వారినీ.. ఇద్దరినీ గుర్తుపెట్టుకొండంటూ పార్టీ శ్రేణులకు ఈ సందర్భంగా వైఎస్ జగన్ కీలక సూచన చేశారు.

బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో విజయవాడ నగరపాలక సంస్థలోని వైసీపీ కార్పొరేటర్లతోపాటు ముఖ్య నాయకులతో మాజీ సీఎం వైఎస్ జగన్ సమావేశమయ్యారు. ఒక్కటే గుర్తు పెట్టుకొండంటూ పార్టీ కేడర్‌కు ఆయన కీలక సూచనలు చేశారు. ఈ జగన్ 2.0 వేరుగా ఉంటుందన్నారు. ఈసారి కార్యకర్తల కోసం జగన్ ఏం చేస్తాడో చూపిస్తాని తెలిపారు. గతంలో పార్టీ శ్రేణులకు అధిక ప్రాధాన్యత ఇవ్వ లేకపోయానని చెప్పారు.

జగన్ 1.0లో ప్రతి పథకం, ప్రతి విషయంలో మొట్టమొదట ప్రజలే గుర్తుకొచ్చి, వారి కోసం తాపత్రయపడ్డానని జగన్ తెలిపారు. ఇప్పుడు చంద్రబాబు మన కార్యకర్తలను పెడుతున్న ఇబ్బందులను చూశానని... మీ అందరికీ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఎవరికి ఏ కష్టం వచ్చినా తనను గుర్తుకు తెచ్చుకోవాలని... తనను 16 నెలలు జైల్లో పెట్టారని... తనపై కేసులు పెట్టింది కూడా కాంగ్రెస్, టీడీపీ నాయకులేనని చెప్పారు. జైలు నుంచి బయటకు వచ్చి ప్రజల అండతో ముఖ్యమంత్రిని అయ్యానని తెలిపారు. ఈ విషయాన్ని అందరూ గుర్తుపెట్టుకోవాలని చెప్పారు. 30 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉంటానని ధీమా వ్యక్తం చేశారు. మున్సిపాలిటీల్లో టీడీపీకి బలం లేకపోయినా బెదిరింపులకు, ప్రలోభాలకు గురి చేసి టీడీపీ వైపుకు తిప్పుకుంటున్నారని జగన్ మండిపడ్డారు. కొందరు ధైర్యంగా నిలబడ్డారని, వారిని చూసి గర్విస్తున్నానని చెప్పారు. ఇచ్చిన ప్రతి హామీని మన ప్రభుత్వ హయాంలో నెరవేర్చామని... అందుకే స్థానిక సంస్థల ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేశామని తెలిపారు. ఎన్నికల్లో ఓడిపోయినా తలెత్తుకుని ప్రజల దగ్గరకు వెళ్లగలమని... కానీ, టీడీపీ నేతలకు ఆ పరిస్థితి లేదని చెప్పారు. చంద్రబాబును నమ్మడమంటే చంద్రముఖిని లేపడమేనని... పులి నోట్లో నోరు పెట్టడమేనని ఆనాడే చెప్పానని తెలిపారు. చంద్రబాబు సూపర్ సిక్స్ లు, సూపర్ సెవెన్ లని చెప్పి ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. ప్రజలు కాలర్ పట్టుకుని నిలదీస్తారనే భయంతో రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని విమర్శించారు.

మన ప్రభుత్వంలో ప్రతిదీ పక్కాగా జరిగిందని... చంద్రబాబు ఎందుకు చేయలేకపోతున్నారనే చర్చ ప్రతి ఇంట్లో జరుగుతోందని జగన్ అన్నారు. ఇసుకను రెట్టింపు ధరలకు అమ్ముకుంటున్నారని... ప్రతి నియోజకవర్గంలో పేకాట క్లబ్ లు కనిపిస్తున్నాయని విమర్శించారు. ఇండస్ట్రీ నడపాలన్నా, మైనింగ్ చేసుకోవాలన్నా డబ్బులు ఇవ్వాల్సిందేనని... ఎమ్మెల్యే దగ్గర నుంచి చంద్రబాబు వరకు పంపకాలు జరుగుతున్నాయని ఆరోపించారు. 9 నెలల్లోనే కూటమి నేతలు దారుణంగా తయారయ్యారని అన్నారు.



అయితే పార్టీలోని కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన వారిని ఎవరిని వదిలిపెట్టమని వైఎస్ జగన్ హెచ్చరించారు. అక్రమ కేసులు పెట్టిన వారిపై ప్రైవేట్ కేసులు వేస్తామని స్పష్టం చేశారు. వారిని చట్టం ముందు నిలబెడతాంటూ వారికి వైఎస్ జగన్ భరోసా కల్పించారు.

గత జగన్ ప్రభుత్వ హాయంలో కార్యకర్తలకు అంత గొప్పగా చేయ లేక పోయిండవచ్చు.. కానీ ప్రతి పథకం, ప్రతి విషయంలో మొట్టమొదటిగా ప్రజలే గుర్తుకు వచ్చారని.. వారి కోసమే తాను తాపత్రయపడ్డానని ఈ సందర్భంగా ఆయన వివరించారు. వారి కోసమే తన టైం కేటాయించానని.. ప్రజల కోసమే అడుగులు వేశానన్నారు. అయితే ప్రస్తుతం సీఎం చంద్రబాబు.. మన కార్యకర్తలను పెడుతున్న ఇబ్బందులు చూశానన్నారు. అలాగే కార్యకర్తల బాధలను సైతం గమనించానని చెప్పారు. వారి అవస్థలను సైతం చూశానని.. వీళ్ల కోసం అండగా ఉంటాడని ఈ సందర్భంగా వైఎస్ జగన్ స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వ హయాంలో ప్రతి నియోజకవర్గంలో పేకాట క్లబ్‌లు నడుపుతున్నారన్నారు. 2024, మే, జూన్ మాసాల్లో ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీతోపాటు సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ, జనసేన కూటమిగా ఏర్పడి బరిలో నిలిచాయి. ఈ ఎన్నికల్లో కూటమి 164 స్థానాలను కైవసం చేసుకుంది. ఇక వైసీపీ కేవలం 11 సీట్లకు పరిమితమైంది. దీంతో ఆ పార్టీకి ప్రతిపక్ష హోదా సైతం దక్కలేదు. అయినా తమ పార్టీకి ప్రతిపక్ష హోదా కల్పించాలంటూ స్పీకర్‌కు లేఖ రాశారు.

సంఖ్య బలం లేకుండా ఆ హోదా ఇవ్వడం సాధ్యం కాదంటూ ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో తనకు ప్రతిపక్ష నాయకుడి హోదా కేటాయించే వరకు తనతోపాటు తన పార్టీ ఎమ్మెల్యేలు ఎవరు అసెంబ్లీలో అడుగు పెట్టమని వైఎస్ జగన్ కీలక ప్రకటన చేశారు. అంతేకాదు.. తనకు ప్రతిపక్ష నాయకుడి హోదా కేటాయించాలంటూ వైఎస్ జగన్.. ఏపీ హైకోర్టును ఆశ్రయించిన విషయం విధితమే.

ఇక 2019 ఎన్నికల్లో వైసీపీ 151 అసెంబ్లీ స్థానాలను గెలుచుకొంది. దీంతో వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్.. అసెంబ్లీలో మూడు రాజధానుల ప్రకటన చేశారు. అదీకూడా ప్రతిపక్ష నేతగా రాజధాని అమరావతికి మద్దతు ప్రకటించిన ఆయన.. సీఎం కాగానే మాటతప్పి మడం తిప్పేశారు. సీఎంగా వైఎస్ జగన్.. కేవలం సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి.. రాష్ట్రాభివృద్ధిని వదిలేశారు. దీంతో రహదారుల పూర్తి అధ్వాన స్థితిలోకి చేరాయి. రాష్ట్రానికి పరిశ్రమలు సైతం రాలేదు. ఇక ఏపీలో ఉన్న పరిశ్రమలు సైతం పక్క రాష్ట్రానికి వెళ్లిపోయాయి. ఇటువంటి పరిస్థితుల్లో 2024లో జరిగిన ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ ఓటరు కూటమిలోని పార్టీలకు పట్టం కట్టిన సంగతి తెలిసిందే.

# ఢిల్లీ టూర్‌లో మంత్రి లోకేష్ బిజీ

-మొదటిపేజీ తరువాయి

వివరించారు. డిఫెన్స్ రంగం పరికరాల తయారీలో పెద్ద ఎత్తున పెట్టుబడులు, ఉద్యోగ అవకాశాలు వస్తున్న నేపథ్యంలో కొన్ని యూనిట్లు ఏపికి వచ్చేలా సహకరించాలని కోరారు. కేంద్రం అందించిన సహకారంతో రాష్ట్ర రాజధాని అమరావతి పనుల పురోగతి, పోలవరం పనులు సాగుతున్న తీరును రాజ్ నాథ్‌కి తెలిపారు.



### ప్రణాళికా బద్ధంగా కృషి..

ఈ భేటీకి టీడీపీ నేతలు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని, శ్రీనివాస వర్మ, లావు శ్రీకృష్ణ దేవరాయలతో పాటు మరి కొందరు కేంద్ర మంత్రులు హాజరయ్యారు. ఈ భేటీలో మంత్రి లోకేష్, గత ప్రభుత్వాన్ని ఉద్దేశించి పలు అంశాలను కూడా ప్రస్తావించారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అస్తవ్యస్తంగా మార్చిందని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం అభివృద్ధి పనులను దశలవారీగా ముందుకు తీసుకువెళ్తుందన్నారు. గత ప్రభుత్వ హైడ్రోజన్ విధానాల వల్ల రాష్ట్రం రూ. 10 లక్షల కోట్ల అప్పులలో చిక్కుకుపోయిందన్నారు.

### కేంద్ర మంత్రి హామీ..

కానీ ఇప్పుడు కేంద్రం రాష్ట్రానికి ఆక్సిజన్ అందిస్తోందని లోకేష్ అన్నారు. రాష్ట్ర అభివృద్ధి విషయంలో కేంద్రం సహకారాన్ని అందిస్తున్నందుకు మంత్రి లోకేష్ కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రధాని మోదీ వికసిత్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా ఏపీని అభివృద్ధి బాటలో నడిపించేందుకు కూటమి ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తోందని మంత్రి రాజ్ నాథ్ సింగ్‌కు వివరించారు. ఈ భేటీ అనంతరం రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్, రాష్ట్ర అభివృద్ధి కోసం అవసరమైన సహాయాన్ని ఇస్తామని లోకేష్‌కు హామీ ఇచ్చారు.

### గూగుల్ క్లౌడ్

మరోవైపు మంత్రి నారా లోకేష్ గూగుల్ క్లౌడ్ ఎండీ బిక్రమ్ సింగ్, కంట్రీ డైరెక్టర్ ఆశిష్‌తో విశాఖపట్నంలో గూగుల్ క్లౌడ్ ఏర్పాటుపై చర్చించేందుకు ఈరోజు ఉదయం ఢిల్లీలో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో గూగుల్ క్లౌడ్ సంస్థ విశాఖపట్నంలో డేటా సిటీ ఏర్పాటుకు సంబంధించిన కీలక అంశాలు చర్చకు వచ్చాయి. మంత్రి లోకేష్ ప్రభుత్వం తరపున గూగుల్ క్లౌడ్‌కు అవసరమైన అనుమతులు, భూ కేటాయింపులు, త్వరితగతిన నిర్ణయాలు తీసుకుంటామని స్పష్టం చేశారు. దీనికోసం ఏపీ ఎకనమిక్ డెవలప్ మెంట్ బోర్డు ఇప్పటికే చురుగ్గా పనిచేస్తోందని చెప్పారు. ఈ క్రమంలో విశాఖపట్నంలో గూగుల్ క్లౌడ్ డేటా సిటీ ఏర్పాటుకు సంబంధించి, కంపెనీ తక్షణమే ప్రాజెక్టును వేగవంతంగా అమలు చేయాలని ఆయన కోరారు. ఈ ప్రాజెక్ట్ పూర్తైతే విశాఖపట్నం ఐటీ రంగంలో కొత్త దిశలో దూసుకెళుందని, తద్వారా రాష్ట్రంలో ఆర్థిక అభివృద్ధికి దోహదపడతుందని లోకేష్ ఆశాభావం వ్యక్తం చేశారు.

ఓర్వకల్లు, కొప్పర్తి నోడ్‌లు, పారిశ్రామిక వాతావరణాన్ని అభివృద్ధి చేయడంపై కేంద్రమంత్రులతో చర్చించి నట్టు మీడియాతో చెప్పారు. అమెరికాలో పర్యటించినప్పుడు తన దృష్టికి వచ్చిన కంపెనీల ఫీడ్ బ్యాక్ గురించి మంత్రులకు వివరించారు.రైల్వే మంత్రి వైష్ణవ్ త్వరలో విశాఖ, తిరుపతిలలో పర్యటించి, చేపట్టిన పనులను స్వయంగా చూస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో పెట్టుబడులను ఏపీకి తీసుకురావడానికి కల్పించాల్సిన వాతావరణంపై చర్చించినట్టు వివరించారు.



ముఖ్యంగా డేటా సిటీల కోసం ఏటా ప్రపంచ వ్యాప్తంగా 300 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెడుతున్నారు. అందులో 100 బిలియన్ డాలర్లు ఇండియాకు వచ్చే వీలుంది. మెజార్టీ వాటా ఏపీకి రావాలన్న స్వార్థం తనకు ఉందన్నారు మంత్రి లోకేష్.మరో రెండు నెలల్లో వైజాగ్‌లో టీసీఎస్ కార్యకలాపాలు ప్రారంభమవుతాయని చెప్పారు మంత్రి. శాశ్వత క్యాంపస్ ఏర్పాటుకు భూమి కోసం అన్వేషణ జరుగుతోందని వివరించారు. కాగ్నిజెంట్ ఏర్పాటుపై త్వరలో ప్రకటన వస్తుందని, ఏడాదిలో ఒక్కో ప్రాజెక్టును ఏర్పాటు చేసుకుంటూ వెళ్తామన్నారు.ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)తో రాబోతున్న అవకాశాలను అందిపుచ్చుకోవడానికి ఏపీ సిద్ధంగా ఉందని, అందుకు కేంద్రం సహకారం కావాలని కోరినట్టు తెలిపారు. ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఎడ్యుకేషన్ కేంద్రాన్ని ఆంధ్రప్రదేశ్‌లో నెలకొల్పాలని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ కోరినట్టు తెలియజేశారు.ఈ క్రమంలో మీడియా పలు ప్రశ్నలు లేవనెత్తింది. డేటా చోరీ విషయంలో వైసీపీ నేతలు చేస్తున్న ఛాలెంజ్ గురించి నోరు విప్పారు మంత్రి లోకేష్. ఎక్కడైనా డేటా చోరీ జరిగిందని నిరూపిస్తే రూ.10 కోట్లు కానుకగా ఇస్తానన్నారు. ప్రభుత్వం తరపున కాకుండా వ్యక్తిగతంగా తాను చెక్‌ను ఇస్తానని తెలిపారు. తనకు అసలు ఫోనే లేదని చెప్పిన జగన్‌కు వాట్సాప్ గవర్నెన్స్ గురించి ఏమి తెలుస్తుంది? ప్రశ్నించారు.గతంలో తాము అధికారంలో ఉన్నప్పుడు డేటా చోరీ జరిగినట్టు వైసీపీ ఆరోపించింది. గడిచిన ఐదేళ్లలో దాని ఊసే లేదన్నారు. అధినేతపై తప్పుడు కేసు పెట్టి 52 రోజులు జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉంచారని గుర్తు చేశారు. అలాంటివాళ్లు తాను ఐటీ మంత్రిగా ఉన్నప్పుడు తప్పు చేసి ఉంటే ఊరికే వదిలిపెడతారా? మాకు ప్రజల డేటా అక్కర్లేదని, కావాల్సింది ఓటర్ లిస్టు మాత్రమేనని, అది పబ్లిక్ డాక్యుమెంట్ అని తెలిపారు.

### మిట్టల్, నిప్పాన్ ఉక్కు పరిశ్రమకు అనుమతులు ఇవ్వండి

విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికుల మనోభావాలను అర్థం చేసుకుని నిధులు విడుదల చేసినందుకు కేంద్ర భారీ పరిశ్రమల మంత్రి హెచ్ డి కుమారస్వామిని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ఢిల్లీలోని ఆయన నివాసంలో బుధవారం కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ పునరుజ్జీవనానికి సుమారు రూ.12వేల కోట్ల రూపాయలు నిధులు విడుదల చేశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఎపి ప్రజల సెంటిమెంట్ తో పాటు వేలాదిమంది కార్మికుల ఆందోళన, మనోభావాలను అర్థం చేసుకుని పెద్దమనసుతో సహకారం అందించారని కొనియాడారు. స్టీల్ ప్లాంట్ ను సందర్శించి అక్కడి పరిస్థితులను అధ్యయనం చేయడం, ఉత్పాదతకు పెంపుదలకు చర్యలు చేపట్టడం, కార్మికుల సమస్యలను నేరుగా తెలుసుకోవడంలో మీ చొరవ శ్లాఘనీయమని అన్నారు. అనకాపల్లి వద్ద ప్రైవేటురంగంలో ఏర్పాటుకానున్న ఆర్సెలర్స్ మిట్టల్, నిప్పాన్ స్టీల్స్ ఉక్కు పరిశ్రమ వల్ల ఎపి యువతకు పెద్దఎత్తున ఉద్యోగావకాశాలు లభిస్తాయని, ఈ పరిశ్రమ ఏర్పాటుకు కేంద్రం తరపున అవసరమైన అనుమతులను త్వరితగతిన మంజూరు చేయాలని కోరారు. అనంతరం అక్కడే ఉన్న మాజీ ప్రధాని దేవ గౌడను కలిసి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

## పరిశ్రమల్లో భద్రతపై ఉన్నతస్థాయి కమిటీ

-మొదటిపేజీ తరువాయి

హుటాహుటిన విశాఖలోని కేర్ ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. వీరి ఆరోగ్యం నిలకడగా ఉందన్నారు. బాధితులకు భవిష్యత్తులో ఎటువంటి ఆరోగ్య సమస్యలు లేకుండా చికిత్స అందించాలని సూచించారు. పరిశ్రమలలో భద్రత, పొల్యూషన్ సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటు న్నాం అన్నారు. పరిశ్రమల్లో భద్రత విషయంలో సమావేశం నిర్వహించాల్సి ఉందని, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉండడం వలన సమావేశం నిర్వహించలేక పోయామని తెలిపారు. త్వరలో సమావేశం నిర్వహిస్తామని అన్నారు. పరిశ్రమల్లో భద్రత పై హై లెవల్ కమిటీ ఏర్పాటు చేస్తాం అని హోంమంత్రి తెలిపారు. ప్రమాదం జరిగిన తరువాత సహాయక చర్యలు వెంటనే చేపట్టే విధంగా పరిశ్రమలు సిద్ధంగా ఉండాలన్నారు. కేజీహెచ్ ఘటన లో రౌడీ షీటర్ ను అరెస్టు చేశామని తెలిపారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కేజీహెచ్ ను త్వరలో సందర్శించి భద్రత పై సమీక్షిస్తామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రులలో మరింత నిఘా పెంచేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించినట్లు హోంమత్రి అనిత పేర్కొన్నారు.

## పవన్ కల్యాణ్‌కు అస్వస్థత

-మొదటిపేజీ తరువాయి

బాధపడుతున్నట్లు తెలుస్తోంది. వైద్యుల సూచన మేరకు ప్రస్తుతం ఆయన విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో గురువారం నాటి రాష్ట్ర క్యాబినెట్ సమావేశానికి పవన్ కళ్యాణ్ హాజరు కాలేకపోచ్చని అధికారులు భావిస్తున్నారు. పవన్ కళ్యాణ్ అస్వస్థతకు గురయ్యారని తెలుసుకున్న జనసైనికులు, అభిమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నారు.

### స్పాండిలైటిస్ అంటే ఏమిటి?

జీవనవిధానంలో మార్పుల వల్ల స్పాండిలైటిస్ సమస్య వస్తుంది. మెడలో వెన్నెముక భాగంలో డిస్కుల మధ్య నరాలు ఉంటాయి. ఈ నరాల మధ్య ఎక్కువ ఒత్తిడి పడటం వల్ల, నరాలు ఒత్తుకోవటం వల్ల మెడనొప్పి, నడుం నొప్పి వస్తుంటుంది. తీవ్రమైన మెడనొప్పితో పాటు తల తిరగడం, తూలి పడిపోతున్నామనే భావన కలుగుతుంది. అంతేకాకుండా వాంతులు రావడం, వికారంగా అనిపించడం, మానసికంగా దిగులుగా ఉంటుంది. ఈ వ్యాధి ఎక్కువ ముదిరితే చేతికి సంబంధించిన కండరాలు కృశించి పోయే అవకాశం ఉంది. దీనివల్ల రక్తసరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. చేతుల్లో స్పర్శ తగ్గడం, ఆందోళన పడటం, బలహీనంగా ఉండటం, తరచూ తలనొప్పితో బాధపడటం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. క్రమంగా జీవన్మరణ సమస్యగా కూడా మారవచ్చు.

## పట్టభద్రుల ఎన్నికల్లో వలంటీర్లు

**గుంటూరు** : ఏపీలో పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల ఇంట్రెస్టింగ్‌గా మారాయి. రెండు స్థానాలకు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పోల్స్ జరగబోతున్నాయి. ఈ నెల 27న జరిగే ఎన్నికకు నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. అయితే గత ఎన్నికల్లో రికార్డు మెజార్టీతో అధికారంలోకి వచ్చిన కూటమి పార్టీలు..ఈ రెండు స్థానాలపై గురిపెట్టాయి.ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించి వారి గెలుపు బాధ్యతను ఆయా జిల్లాల్లోని ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులకు అప్పగించింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి, నేతల వలసలతో డీలా పడిపోయిన వైసీపీ ఈ ఎన్నికల్లో పోటీ చేయకూడదని డిసైడ్ అయింది. దీంతో వార్ వన్ సైడ్ అన్నట్లుగా ఉంటుందని భావించిన కూటమికి..వాలంటీర్ల రూపంలో సవాళ్లు ఎదురవుతున్నాయి. కూటమి పార్టీల అభ్యర్థులపై పోటీకి వాలంటీర్లు సై అంటుండటం ఆసక్తి రేపుతోంది.కృష్ణ-గుంటూరు, గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక వేడెక్కుతోంది. ప్రతిపక్షం వైసీపీ పోటీకి దూరంగా ఉండిపోవడంతో గెలుపు నల్లేరు మీద నడకే అని భావించాయి కూటమి పార్టీలు. అనూహ్యంగా పోటీకి సై అంటూ వాలంటీర్లు దూసుకు వచ్చారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు తమకిచ్చిన మాటను తప్పారంటూ కూటమి అభ్యర్థులను దెబ్బతీయాలని భావిస్తున్నారట వాలంటీర్లు. పట్టభద్రుల ఎమ్మెల్సీగా తమలో ఒకరిని పోటీకి నిలబెట్టాలని నిర్ణయించారు.విజయవాడలో జరిగిన సమావేశంలో గోదావరి జిల్లాల పట్టభద్ర ఎమ్మెల్సీగా వాలంటీర్ వానపల్లి శివగణేశ్, కృష్ణ-గుంటూరు నుంచి వాలంటీర్ లంక గోవింద రోజులు పోటీకి దిగనున్నారు. గత ప్రభుత్వంలో సేవలు అందించిన వాలంటీర్లను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పక్కన పెట్టింది. అయితే పలుసార్లు విజ్ఞప్తి చేసినా..నిరసన తెలిపినా వారిని విధుల్లోకి తీసుకోలేదు. దీంతో ఎమ్మెల్సీగా పోటీ చేసి తమ సత్తా చాటాలని వాలంటీర్లు భావిస్తున్నారు.గత ఎన్నికల్లో వైసీపీ ఓటమికి వాలంటీర్లే కారణమనే అభిప్రాయం ఉంది. క్యాడర్, లీడర్లను పట్టించుకోకుండా వాలంటీర్లకు పెద్దరికం ఇవ్వడం వల్లే కార్యకర్తలు అసంతృప్తికి లోనయ్యారన్నది కాదనలేని వాస్తవం. వైసీపీ ఓడిపోవడానికి ప్రధాన కారణాల్లో ఇదీ ఒకటనేది పొలిటిక్స్ ఎక్స్‌పర్ట్స్ మాట. అయితే వాలంటీర్లు మాత్రం ఐదేళు ప్రజలకు సేవలందించి మంచి పేరు తెచ్చుకున్నామని, కూటమి ప్రభుత్వం తమను మోసం చేసిందని ప్రచారం చేస్తున్నారు.కూటమి గెలిస్తే వాలంటీర్ల వేతనాలను రూ.10 వేలు చేస్తామని చెప్పారని, విద్యార్హతకు తగినట్లు ఇతర ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేస్తున్నారు. అధికారంలోకి వచ్చాక మాట మార్చి వాలంటీర్లు విధుల్లోనే లేరని తప్పించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమను మోసగించిన ప్రభుత్వానికి ఎమ్మెల్సీ ఎన్నికలను అస్త్రంగా వాడుకుని నిరసన తెలియజేస్తామంటున్నారు.ఒక్కో ఎమ్మెల్సీ స్థానంలో దాదాపు 3 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే ఒక్కోచోట దాదాపు లక్షన్నర ఓటర్లను చేర్పించారు. ఈ పరిస్థితుల్లో కూటమి పార్టీల అభ్యర్థుల విజయంపై నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. అయితే అనూహ్యంగా వాలంటీర్లు రంగంలోకి దిగడం, వారికి ఓటర్లతో నేరుగా సంబంధాలు ఉండటంతో ఎంతటి ప్రభావం చూపుతారనే చర్చ జరుగుతోంది. వాలంటీర్లు విజయం సాధించే అవకాశాలు లేకపోయినా వారికి దక్కే ఓట్లు ప్రభుత్వ వ్యతిరేకతను తెలియజేసే చాన్స్ ఉందంటున్నారు. దీంతో పట్టభద్రుల ఎమ్మెల్సీ పోరు ఉత్కంఠ రేపుతోంది. గ్రాడ్యుయేట్ పోల్స్‌లో వాలంటీర్ల ప్రభావం ఎంతుంటుందో చూడాలి మరి

## భవన నిర్మాణాలపై కొత్త మార్గదర్శకాలు

**విజయవాడ :** భవన నిర్మాణ అనుమతులపై ఏపీ ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. రాష్ట్రంలోని అన్ని పట్టణ ప్రాంతాల్లో స్థానిక సంస్థలు సెల్ఫ్ సర్టిఫికేషన్ స్కీమ్ కింద భవన నిర్మాణాలకు అనుమతులు ఇచ్చేలా మార్గదర్శకాలు ఇచ్చింది. ఒక్క సీఆర్‌డీఏ మినహా రాష్ట్రంలోని అన్ని చోట్లా భవన నిర్మాణ అనుమతుల జారీ అధికారాన్ని అర్బన్ డెవలప్మెంట్ అథారిటీల నుంచి పట్టణ స్థానిక సంస్థలకు బదిలీ చేస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది.300 చ.మీటర్ల లోపు నిర్మాణాలకు స్వయంగా యజమానులే ప్లాన్ ను ధ్రువీకరించి దరఖాస్తు చేసేలా చట్టంలో సవరణలు చేశారు. ఇంజినీర్లు, ఆర్కిటెక్టులు, టౌన్‌ప్లానర్లు సైతం దరఖాస్తు చేసేందుకు అవకాశం కల్పించింది. దీంతో పాటు లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్‌లు కూడా ఇంటి ప్లాన్‌ను ధ్రువీకరించి అప్లోడ్ చేసేందుకు అవకాశం కల్పించింది. అయితే కేవలం నివాస భవనాలకు మాత్రమే ఈ వెసులుబాటు కల్పించినట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు పోర్టల్‌లో ప్లాన్ అప్లోడ్ నిబంధనలను సులభతరం చేసింది.రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగాన్ని ప్రోత్సహించేందుకు భవన నిర్మాణ అనుమతులను మరింత సరళతరం చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా భవన నిర్మాణ అనుమతులకు సెల్ఫ్ సర్టిఫికేషన్ ప్రక్రియను ప్రవేశపెట్టనున్నట్లు ప్రకటించింది. అయితే ఆన్‌లైన్ బిల్డింగ్ పర్మిషన్ సిస్టంలో ఎలాంటి ఉల్లంఘనలు జరిగినా భవన యజమానులపై కఠిన చర్యలు ఉంటాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు పురపాలక శాఖ సీఎస్ సురేశ్ కుమార్ మార్గదర్శకాలు జారీ చేశారు



షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు · తెలుగు దినపత్రిక
ప్రకాశం



## త్వరలోనే మిమ్మలను కలుస్తా

### ఆరోగ్య రీత్యా ఆపరేషన్ చేయించుకోవాలని నిర్ణయం
### ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 5)

ఈ మధ్య కొన్ని రోజుల క్రితం హెల్త్ రీజన్స్ దృష్ట్యా వైద్యులు నాకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం జరిగింది. వైద్యుల బృందం సరైన ఆరోగ్య పరిస్థితి మెరుగ్గా ఉండాలనుకొన్నప్పుడు హార్ట్ బైపాస్ సర్జరీ చేయాలని (తరువాయి 4లో...)

# పేదల ఇళ్లు పాడుబెట్టారు

**జగన్ పాలనలో అంతా నిర్లక్ష్యమే**

**పేదల సొంతింటి కల సాకారానికి టీడీపీ హయాంలో టిడ్కో ఇళ్లు**

**వైసీపీ పాలనలో పూర్తిగా నిర్లక్ష్యం**

**నేడు అడవిని తలపిస్తూ సాలెగూళ్లుగా మారిన గఅహాలు**

**60 శాతం పనులతో అసంపూర్తిగా మిగిలిన నిర్మాణాలు**

**పూర్తి చేయడానికి రూ.342.29 కోట్లు అవసరం**

**కూటమి ప్రభుత్వంపై అర్హుల్లో ఆశలు**




(షణ్ముఖ వెలుగు బ్యూరో, ప్రకాశం, ఫిబ్రవరి 4)

జగన్ పాలనలో చేసిన నిర్లక్ష్యం పేదల గఅహాలకు శాపంగా మారింది. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన టిడ్కో ఇళ్లను వైసీపీ సర్కారు కావాలనే పాడుబెట్టింది. పేదల సొంతింటి కలను చెరిపేసింది. నవరత్నాలంటూ అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేసిన వైసీపీ ప్రభుత్వం జీప్లస్ త్రీ భవనాలను చూసి ఓర్చుకోలేకపోయింది. అధికారంలోకి వచ్చే సమయానికి 60 శాతం పనులు పూర్తయినా పట్టించుకోకపోగా, పైసా నిధులు విడుదల చేయలేదు. దానికి తోడు లబ్ధిదారుల పేరుతో బ్యాంకుల్లో రుణాలు తీసుకుని నవరత్నాలకు మళ్లించి ఘోరంగా మోసం చేసింది. దీంతో పట్టణ పేదల ఇళ్లు పాడుబడిపోయాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అర్హుల్లో ఆశలు మొదలయ్యాయి. వాటి నిర్మాణం పూర్తికి అవసరమైన నిధుల కోసం సర్కారు ప్రయత్నాల్లో ఉన్నట్లు తెలుస్తోంది. పట్టణ పేదల సొంతింటి కల నెరవేరడానికి నిధుల సమస్య ఎదురైంది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పేదల ఇళ్లను పాడుబెట్టారు. పైసా ఖర్చు చేయకుండా, లబ్ధిదారులకు ఇళ్లు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేశారు. పట్టణ పేదల కోసం పక్కా ఇళ్లు నిర్మించి, పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు గత తెలుగుదేశం ప్రభుత్వం టిడ్కో ఇళ్ల నిర్మాణాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రారంభించింది. జిల్లాలోని ఒంగోలు, మార్కాపురం, గిద్దలూరు, కనిగిరిలో జీప్లస్ త్రీ నిర్మాణాలను చేపట్టి అర్హులైన వారికి ఇంటి పత్రాలు మంజూరు చేసింది. 60 శాతం పనులు పూర్తి చేసింది. 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావడంతో అంతా తారుమారైంది. గత ఐదేళ్లలో అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం పేదల ఇళ్లపై సీతకన్ను వేసింది. కనీస నిధులు కేటాయించకపోవ డంతో పాటు, పనుల గురించి పట్టించుకోకపోవడంతో పట్టణ పేదల్లో ఇంటి బెంగ ఏర్పడింది. పైగా లబ్ధిదారుల పేరుతో బ్యాంకుల్లో రుణాలు తీసుకుని వాటిని నవరత్నాలకు మళ్లించడంతో వారు గగ్గోలుపెట్టారు. ప్రస్తుతం సొంతింటి గఅహప్రవేశం చేసే పరిస్థితి లేకపోగా, ఇంటిపై పొందిన రుణంతో వారిలో ఆందోళన మొదలైంది. నెలనెలా రుణం వాయిదా చెల్లించాలని బ్యాంకర్లు ఒత్తిడి చేస్తుండటంతో దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో టిడ్కో ఇళ్లపై మరోసారి ఆశలు పెంచుకున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 7,200 మందికి ఇళ్ల కేటాయింపులు జరిగాయి. దాదాపు ఐదేళ్లపాటు నిలిచిపోయిన పనులు పూర్తిచేయడానికి రూ.342.29 కోట్ల అవసరం పూర్తిచేయడానికి రూ.342.29 కోట్ల అవసరం ఉన్నట్లు అధికారులు అంచనా వేశారు. జిల్లాలో మొత్తం 7,200 మంది టిక్కో ఇళ్ల లబ్ధిదారులు ఉన్నారు. అందులో 300 ఎస్ఎఫ్టీ లబ్ధిదారులు 4,800 మంది, 365 ఎస్ఎఫ్టీ లబ్ధిదారులు 1,296, 400 ఎస్ఎఫ్టీ లబ్ధిదారులు 1,104 ఉన్నారు. ఒంగోలులో ఫేజ్-2 కిందచింతల వద్ద 1,392, ఫేజ్-3 కింద కొప్పోలు వద్ద 2,736, గిద్దలూరులో ఫేజ్-3 కింద 1,248,కనిగిరిలో ఫేజ్-3 కింద చాకిరాల వద్ద 912, మార్కాపురంలో ఫేజ్-3 కింద పెదనాగులవరం రోడ్డులో 912 టిడ్కో ఇళ్లకు లబ్ధిదారులు అర్హత పొందారు.

**అడవిని తలపిస్తున్న భవన సముదాయాలు..**

వైసీపీ నిర్వాకంతో గడిచిన ఐదేళ్లలో జిల్లాలో టిడ్కో ఇళ్లపై లబ్ధిదారులు ఆశలు వదిలేసుకున్నారు. ప్రస్తుత ఆ సముదాయాల పరిస్థితి చూస్తే ఇంటి గోడల నిర్మాణం పటిష్టంగానే ఉన్నా, ఫ్లోరింగ్ లేచిపోయి, మెట్లు పగిలిపోయి శిథిలావస్థకు చేరాయి. మరోవైపు అడవిని తలపించే విధంగా చెట్లు పెరిగిపోవడంతో విషపురుగులు సంచరించడంతో ఆ ప్రాంతంలో కాలుపెట్టే పరిస్థితి లేదు. అర్ధంతరంగా ఆగిపోయిన పనులు నేటికి ఒక కొలిక్కి రాకపోవడంతో ఎండకు, వానకు, ఇనుము పాడై తుప్పుపట్టింది. కొప్పోలులో కనీస రహదారులు కూడా లేకపోగా, చింతల వద్ద నిర్మాణాలు లోతట్టు ప్రాంతాల్లో ఉండటంతో భారీగా నీరు నిలిచి ప్రాంగణంలో కాలు పెట్టలేని పరిస్థితి ఉంది. కట్టుబడి మొత్తం పూర్తయినా, తలుపులు, ఇతర మౌలిక వసతులు మాత్రమే మిగిలి ఉన్నాయి. అయితే అధికారులు గతేడాది చివరికి కేటాయింపులు జరుగుతాయని (తరువాయి 4లో...)



## పునర్నిర్మాణంలో ఉన్న పొదిలి సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించిన ఎస్పీ ఏ ఆర్ దామోదర్

(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఫిబ్రవరి 5)

పొదిలి పట్టణంలో పునర్నిర్మాణంలో ఉన్న పొదిలి పోలీస్ సర్కిల్ కార్యాలయ భవనాన్ని జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ బుధవారం సందర్శించి, పనుల నాణ్యతను పరిశీలించారు. మరమ్మత్తులకు ఫైనల్ టచింగ్‌గా చేయాల్సిన ఏర్పాట్ల గురించి వివరించారు. భవన పునర్నిర్మాణాన్ని, దగ్గరుండి మరమ్మతులు చేయించి అందంగా తీర్చిదిద్దిన పోలీస్ సిబ్బందిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

## త్వరలోనే మార్కాపురం జిల్లా తథ్యం

### ప్రతి శనివారం మార్కాపురంలో ఇక ప్రజా దర్బార్
### మీడియా సమావేశంలో మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, ఫిబ్రవరి 5)

త్వరలోనే మార్కాపురం కేంద్రంగా ప్రత్యేక జిల్లా ఏర్పాటు తథ్యమని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణను తాను కలిశానని, ఆయన ప్రత్యేక జిల్లా విషయం పై తనతో చర్చించారని, త్వరలోనే ప్రత్యేక జిల్లా ఏర్పాటు కావడం ఖాయమని తెలియజేశారన్నారు. బుధవారం పట్టణంలోని జవహర్ నగర్‌లో తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం జరిగిన రథసప్తమి వేడుకలు మునుపెన్నడూ లేని విధంగా దిగ్విజయం చేశారని అన్నారు. ముఖ్యంగా వేడుకల్లో వేలాది మంది ప్రజలు పాల్గొన్నా మున్సిపల్ సిబ్బంది కష్టించి పని చేసి రోడ్ల పై ఎలాంటి చెత్తా,






## చలి..పులి...!

### వణికిస్తున్న శీతల గాలులు

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం డివిజన్ ఇన్‌ఛార్జి, ఫిబ్రవరి 5)

జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో గల యర్రగొండపాలెం నియోజకవర్గంలోని యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం, పెద్ద దోర్నాల, పెద్దారవీడు మండలాల ప్రజలను చలి వణికిస్తోంది. రోజంతా శీతల గాలులు వీస్తున్నాయి. ఉష్ణోగ్రతలు 15 డిగ్రీల కు పడిపోయాయి. చలి, శీతల గాలులతో ప్రజలు ఫ్లూ, జ్వరాలతో సతమతం అవుతున్నారు. చలికాలంలో జాగ్రత్తలు తప్పవని వైద్యులు సూచిస్తున్నారు... మొన్నటి వరకు ఆలస్యం అయ్యిం దనుకున్న శీతాకాలం ఎట్టకేలకు వచ్చేసింది. వచ్చీ రాగానే శీతల గాలులు వీస్తున్నాయి. సాయంత్రం కూడా కాకముందే వాతావరణం చల్లగా మారిపోతోంది. రాత్రి గడిచేకొద్దీ మరింత చల్లగా మారి జనాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఈ సమయంలో బయటకు రావాలంటేనే ప్రజలు జంకుతున్నారు. వెచ్చదనం కోసం తపించి పోతున్నారు. చలిపులి భయపెడుతోంది. కార్తీకమాసం వెళ్లినా ఇంకా చలి ప్రారంభం కాలేదని అందరూ అనుకున్నారు. ప్రస్తుతం చలితో పాటు శీతల గాలులు వీస్తున్నాయి. సాయంత్రం 6 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు చలి తీవ్రత ఎక్కువగా ఉంటోంది. అన్ని చోట్లా శీతలగాలులు వీస్తున్నాయి. చాలా ప్రాంతాల్లో అత్యల్ప ఉష్ణోగ్రతలు 15 డిగ్రీలకు పడిపోయాయి. బుధవారం తెల్లవారుజామున అత్యల్పంగా 15 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. వ్యవసాయ భూములుండే గ్రామీణ ప్రాంతాల్లో చలి ప్రభావం మరింత ఎక్కువగా ఉంది. ఈ క్రమంలో చలి కారణంగా ప్రజలు జలుబు, దగ్గు, బారిన పడుతున్నారు. చిన్న పిల్లలు, వృద్ధులు, (తరువాయి 4లో...)

## నీటి సంరక్షణతోనే సమగ్రాభివృద్ధి సాధ్యం

### కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా

(షణ్ముఖ వెలుగు, పీసీపల్లి, ఫిబ్రవరి 5)

నీటి సంరక్షణతోనే సమగ్రాభివృద్ధి సాధ్యమని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా అన్నారు. నీటిని పొదుపుగా వినియోగించుకోవడం, నీటి వనరులను కాపాడుకోవటం మన అందరి బాధ్యత అని చెప్పారు. ఈ దిశగా వాటర్ షెడ్ పథకం కింద డ్వామా ఆధ్వర్యంలో అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పించేందుకు పెదచెర్లోపల్లి మండలం మురగమ్మి పంచాయతీలోని జంగాలపల్లి గ్రామంలో బుధవారం నిర్వహించిన అవగాహన యాత్ర కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా ఢిల్లీ నుంచి ఈ పథకం వినియోగాలపై కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చేసిన ప్రసంగాలను ప్రత్యక్ష ప్రసారం ద్వారా ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్థానికులు వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత రెండేళ్ల నుంచి ఈ పంచాయతీలో నీటి సంరక్షణ కోసం వాటర్ షెడ్ పథకం కింద పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. జిల్లా యంత్రాంగం, రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రూపొందించిన విజన్ డాక్యుమెంట్లలో కూడా నీటి సంరక్షణకు అధిక ప్రాధాన్యం ఇచ్చాయన్నారు. పంటల సాగుకు, పేదరిక నిర్మూలనకు, తలసరి ఆదాయం పెంపునకు నీటి సంరక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ బాధ్యత మన అందరి పైనా ఉందన్నారు. ఈ గ్రామాన్ని ఆదర్శంగా తీసుకుని జిల్లావ్యాప్తంగా నీటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ పూనుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ క్షామపీడిత ప్రాంతానికి, ముఖ్యంగా మన పశ్చిమ ప్రాంతానికి వాటర్ షెడ్ పథకం అనేది ఒక వరం అని వ్యాఖ్యానించారు.





# నీటి సంరక్షణతోనే సమగ్రాభివృద్ధి సాధ్యం















నీటి వనరులను జాగ్రత్తగా కాపాడుకుంటే మన ప్రాంతం నుంచి వలసలను నివారించవచ్చని అన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి మన ఇంటిలో ఉన్న చెట్లను వాస్తు పేరుతో నరికించి వేయటం సరికాదని చెప్పారు. చెట్టును నరికించడం అంటే మన బిడ్డను కోల్పోవడమేనని ఆయన వ్యాఖ్యానించారు. మూఢ నమ్మకాలను విడనాడి శాస్త్రీయ దృక్పథంతో చెట్లను కాపాడుకుందామని పిలుపునిచ్చారు. ఇంట్లో వినియోగించిన నీటిని రోడ్లమీదకి వదలకుండా మన స్థలంలోనే ఇంకిపోయేలా ఇంకుడు గుంటలను తవ్వుకోవాలని చెప్పారు. ఇందుకు ప్రభుత్వం కూడా ఆర్థిక సహాయం చేస్తుందన్నారు. వాటర్ షెడ్ డైరెక్టర్ మాట్లాడుతూ ప్రతి నీటి బిందువును పొదుపు చేయాల్సిన అవసరం ఉందన్నారు. నీటి సంరక్షణ అనేది ప్రతి ఒక్కరి జీవన శైలిలో భాగం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ దిశగా దృష్టి సారించినట్లు చెప్పారు. స్పెషల్ విజిలెన్స్ ఆఫీసర్ భవాని హర్ష మాట్లాడుతూ జల వనరులను కాపాడుకుంటూ భూగర్భ నీటిమట్టం పెంపుపై ప్రతి ఒక్కరు దృష్టి పెట్టాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ రాబోయే తరాలకు నీటి సమస్య తలెత్త కుండా బాధ్యతగా వ్యవహరించాల్సి ఉందన్నారు. ఈ దిశగా ప్రభుత్వం అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. నీటిని పొదుపుగా వినియోగించుకుంటామని, నీటి వనరులను కాపాడుకుంటామని ఈ సందర్భంగా స్థానికులతో అతిథులు ప్రతిజ్ఞ చేయించారు. అవగాహన యాత్రకు జెండా ఊపి కలెక్టర్ ప్రారంభించారు. నీటి సంరక్షణపై విద్యార్థులకు నిర్వహించిన పోటీలలో విజేతలైన వారికి ప్రశంసా పత్రాలను అందించారు. డ్వామా ఆధ్వర్యంలో నీటి సంరక్షణపై నిర్వహించిన నాటక ప్రదర్శన ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారిని ఆకట్టుకుంది. ముందుగా ఉపాధి నిధులతో నేరేడుపల్లిలో నిర్మించిన సిసి రోడ్డును కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రలు ప్రారంభించారు. అనంతరం పీసీపల్లి మండలంలోని వెంగలాయపల్లి సమీపంలో నిర్మించనున్న బయోగ్యాస్ ప్లాంట్ స్థలాన్ని కలెక్టర్, ఎమ్మెల్యే పరిశీలించారు. ఆ స్థలానికి సంబంధించి వివరాలను తహశీల్దార్ ఉష వివరించారు. ఈ కార్యక్రమంలో వాటర్ షెడ్ అడిషనల్ పి డి వందర్ మ్యాన్, ఏపిడి చంద్రశేఖర్‌రెడ్డి, మర్రిపూడి డబ్ల్యూసిసి ప్రాజెక్ట్ ఆఫీసర్ రాజేష్ కుమార్, తహసిల్దార్ ఉషా, ఎంపిడిఓ శర్మ, టిడిపి నాయకులు కడప ఓబుల్‌రెడ్డి, హనుమారెడ్డి, పువ్వాడి నాగరాజు, పువ్వాడ మల్లిఖార్జున్, నాగోతు శ్రీనివాసులు, కృష్ణారెడ్డి, ఎం నాగేశ్వరరావు, వీరపునేని పెద్దన్న, పులి ప్రతాప్‌రెడ్డి, రాధా, బోయపాటి రమేష్, జోసఫ్, సత్యంరెడ్డి, వెంకట కొండారెడ్డి, ఇతర అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# చలి..పులి...!

వ్యాధినిరోధక శక్తి తక్కువగా ఉన్న వారు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. చాలా మంది శ్వాసనాళాలు మూసుకుపోయి ఉపిరాడక ఉక్కిరి బిక్కిరవుతున్నారు. అదే సమయంలో ఒక రకమైన ఇన్ఫ్లూయెంజా వైరస్ కూడా ఈ సీజన్లో వచ్చే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. శీతల గాలుల నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు.

**ఆసుపత్రులకు పెరిగిన రోగులు :** చలి తీవ్రత పెరగడంతో అసుపత్రులకు రోగులకు సంఖ్య పెరుగుతోంది. యర్రగొండపాలెం ఏరియా వైద్యశాలలకు ఊపిరితిత్తుల విభాగానికి గతంలో ప్రతి బుధ, శని వారాల్లో ఓపీ ఉండేది. ప్రస్తుతం ప్రతి రోజూ 50 మందికి పైగా రోగులు వస్తుండగా, గత కొన్ని రోజుల నుంచి రోగుల సంఖ్య రోజూ 80 దాటుతోంది. అలాగే ప్రైవేటు ఆసుపత్రులు, క్లినిక్లలో కూడా రోగుల



సంఖ్య 30 శాతం పెరిగినట్లు వైద్యులు చెబుతున్నారు.

**దీర్ఘకాలిక రోగులూ జాగ్రత్త :** శీతాకాలంలో శీతల గాలులు విస్తున్న వేళ దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు బాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. మధుమేహం, బీపీ, చైరాబర్, ఆస్తమా, సిఓపిడితో బాధపడేవారు దగ్గు, జలుబు, ఆయాస వస్తే అశ్రద్ధ చేయకుండా వైద్యులను కలిసి వారి పరిస్థితిని వివరించి చికిత్స తీసుకోవాలని అంటున్నారు. వీరు చలి కాలంలో ఉదయం వేళ మంచుకురుసే సమయంలో వాకింగ్, జాగింగ్కు వెళ్లకపోవడమే మంచిదని వైద్యులు చెబుతున్నారు.

## త్వరలోనే మిమ్మలను కలుస్తా

వైద్యులు సూచించారు. దీంతో ఫిబ్రవరి 6వ తేదిన చెన్నై లోని అపోలో హాస్పిటల్ లో బైపాస్ హార్ట్ ఆపరేషన్ చేయాలని వైద్యుల బృందం నిర్ణయించడం జరిగింది. ఈ ఆపరేషన్ సక్రమంగా జరిగిపోతుందని, ఎలాంటి ఇంబ్బందులు లేకుండా సక్రమంగా జరిగిపోతుందని ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యుల బృందం తెలపడం సంతోషకర విషయం. దీంతో పాటు ప్రజలకు ఇంకా ఎక్కువ సేవలు చేసేందుకు అవకాశాలు ఎక్కువగా మెరుగ్గా ఉంటాయని వైద్యులు తెలిపిన మీదట ఆరోగ్య రీత్యా ఆపరేషన్ చేయించుకోవాలని నేను నిర్ణయించుకొన్నాను. రేపు మీ అందరి ఆశీస్సులతో పాటు భగవంతుని ఆశీస్సులతో ఆపరేషన్ సక్రమంగా జరిగి మీసేవలు కొనసాగించేందుకు మెరుగుబడిన ఆరోగ్యంతో మీ ముందుకు త్వరలోనే నేను ఒంగోలుకు వచ్చి మిమ్మల్నందరిని కలుసుకొంటాను. ఎక్కువ రోజులు కాదు త్వరలోనే కలుసుకొంటానని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

# త్వరలోనే మార్కాపురం జిల్లా తథ్యం





చెదారం లేకుండా రోడ్లను శుభ్రంగా ఉంచారన్నారు. రాత్రి 12 గంటల వరకు కూడా మున్సిపల్ సిబ్బంది కష్టపడుతూనే ఉన్నారని, వారి శ్రమను అభినందించారు. పోలీస్ సిబ్బంది, రెవిన్యూ సిబ్బంది అత్యంత అప్రమత్తంగా ఉండి ఎవరికి ఏ ఇబ్బంది రాకుండా చేశారని కొనియాడారు. భవిష్యత్తులో కూడా మార్కాపురం పట్టణంలో ఏ వేడుకలు జరిగిన ఇదే విధంగా దిగ్విజయం చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. త్వరలోనే ప్రతి శనివారం మార్కాపురం పట్టణంలో వివిధ మండల కార్యాలయాలలో ప్రజా దర్బార్ నిర్వహిస్తామన్నారు. ఈ ప్రజాదర్బార్‌లో అధికారులు, నాయకులు అందుబాటులో ఉండి ప్రజల సమస్యలు ఎక్కడికక్కడే పరిష్కరిస్తారని స్పష్టం చేశారు. మార్కాపురం పట్టణంలో ఎటువంటి నీటి సమస్య లేకుండా చేస్తామని దీనికి రెండు, మూడు రోజుల్లో టెండర్లు కూడా ఆహ్వానిస్తున్నామని ప్రజలందరూ నిశ్చింతగా ఉండాలని అన్నారు. వచ్చే బడ్జెట్లో వెలిగొండ ప్రాజెక్టుకు రెండు వేల కోట్లు కేటాయించాలని అది నాయకులను, అధికారులను కోరుతామని వచ్చే మూడేళ్లలో వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసి ఆయకట్టుకు మీరు అందిస్తామని అన్నారు. మీడియా సమావేశంలో మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్, టీడీపీ నాయకులు గుంటక సుబ్బారెడ్డి, పట్టణ అద్యక్షులు షేక్ మౌలాలి, జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్ళపల్లి సత్యనారాయణ, మున్సిపల్ కౌన్సిలర్ నాలి కొండయ్య, ఇతర తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# పునర్నిర్మాణంలో ఉన్న పొదిలి సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించిన ఎస్పీ ఏ ఆర్ దామోదర్

ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ వెంట దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ, పొదిలి ఎస్ఐ వి వేమన, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.





# పేదల ఇళ్లు పాడు బెట్టారు

వెల్లడించారు. కానీ నేటికీ కేటాయింపుల జరగలేదు. టిడ్కో ఇళ్ల వాస్తవ పరిస్థితిని చూస్తే మరింత దయనీయంగా మారింది. ఇదిలా ఉండగా, నాడు పేదల సొంతింటి కల నిజం చేసేందుకు శ్రీకారం పలికిన టీడీపీ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రావడంతో లబ్ధిదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

## అంగన్వాడీ కేంద్రంలో ఆఖీఫా అన్నప్రాసన వేడుకలు




(షణ్ముఖ వెలుగు, కంభం, ఫిబ్రవరి 5)

కంభం పట్టణంలోని స్థానిక అంగన్వాడీ కేంద్రం 63లో బుధవారం షేక్.అహ్మద్ బాషా, షేక్.కరిష్మా దంపతుల గారాల పట్టి షేక్.ఆఖీఫా అన్నప్రాసన వేడుకలు అంగన్వాడీ కార్యకర్త లక్ష్మీదేవి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ కేంద్రాన్ని అన్నప్రాసనకు ముస్తాబు చేయగా, పలువురు తల్లులు, పిల్లలు హాజరు కాగా, రకరకాల వస్తువులు ఏర్పాటు చేయగా చిన్నారి ఆఖీఫా పుస్తకాలు, పూలు పట్టుకోవడం విశేషం. అనంతరం అంగన్వాడీ కార్యకర్త లక్ష్మీదేవి చిన్నారి ఆఖీఫా కు పాయసం ముట్టించి అన్నప్రాసన చేశారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న తల్లులు చిన్నారి ఆఖీఫా ను ఆశీర్వదించారు. తదుపరి పిల్లలకు అంగన్వాడీ ఆయా షేక్ ఖైరూన్ బీ బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పిల్లలు, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

## జనసేన నాయకులు కంది రవిశంకర్‌ను కలిసిన జిల్లా ఎంపిటిసిల సంఘం అధ్యక్షులు ఆకుపాటి వెంకటేష్





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 5)

ప్రముఖ పారిశ్రామికవేత్త, ప్రకాశం జిల్లా జనసేన పార్టీ నాయకులు కంది రవిశంకర్‌ని బుధవారం ఆయన నివాసంలో జిల్లా ఎంపిటిసిల సంఘం అధ్యక్షులు ఆకుపాటి వెంకటేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు విషయాలపై వారు చర్చించారు. ఆకుపాటి వెంకటేష్ వెంట నీరుకట్టు నాయబ్ రసూల్, ఇండ్ల నరసింహారావు, గాడి మాలకొండయ్య, పుప్పాల రామ్మూర్తి, టెంకం ప్రసాద్, కటకం భాను, పసుపులేటి పవన్ కళ్యాణ్, తదితరులు ఉన్నారు.

## గొర్రెపాటి శీనుకు జన్మదిన శుభాకాంక్షలు

### జిల్లా ఎంపిటిసిల సంఘం అధ్యక్షులు ఆకుపాటి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 5)

ప్రకాశం జిల్లా జనసేన పార్టీ నాయకులు గొర్రెపాటి శీను జన్మదిన వేడుకలు ఆయన నివాసంలో బుధవారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ప్రకాశం జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు ఆకుపాటి వెంకటేష్ తన మిత్ర బృందంతో కలిసి ఆయనకు బొకే అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం గొర్రెపాటి శ్రీనును శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇండ్ల నరసింహారావు, నీరుకట్టు నాయబ్ రసూల్, గాడి మాలకొండయ్య, పుప్పాల రామ్మూర్తి, టెంకం ప్రసాదు, పసుపులేటి పవన్ కళ్యాణ్, కటకం భాను, తదితరులు పాల్గొన్నారు.

# గిద్దలూరు శాఖ గ్రంథాలయానికి స్టీల్ ర్యాక్ వితరణ



(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, ఫిబ్రవరి 5)
గిద్దలూరు నగర పంచాయతీ పరిధిలోని శాఖ గ్రంథాలయంలో విజ్ఞాన పుస్తకాలను, వార్తా పత్రికలను, మాస పత్రికలను, వివిధ రకాల పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను అమర్చుటకు అవసరమైన స్టీల్ ర్యాక్‌ను రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులు డాక్టర్ మొర్రి. పిచ్చయ్య తన సొంత నిధుల నుంచి ఖర్చు చేసి గ్రంథ పాలకురాలు ప్రసన్నకుమారికు బుధవారం అందజేశారు. దాత పిచ్చయ్య మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞానానికి ఆలయాలు, గ్రంథాలయాలకు క్రమం తప్పకుండా విద్యార్థులు, నగర ప్రజలు వచ్చి సమయాన్ని సద్వినియోగపరుచుకోని విజ్ఞానాన్ని పొందాలన్నారు. విద్యార్థులు సెలవు దినాలల్లో గ్రంథాలయానికి వచ్చి అనేక కొత్త విషయాలను శోధించి తెలుసుకునేందుకు చక్కటి విజ్ఞాన భాండాగారం గ్రంథాలయమన్నారు. ఈ కార్యక్రమంలో యశ్వంత్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షురాలు తిరుపతమ్మ, విశ్రాంత ఉపాధ్యాయులు బీరం రామిరెడ్డి, పీరయ్య, పాఠకులు పాల్గొన్నారు.

# మానుగుంటను కలిసిన ఆదాల



(షణ్ముఖ వెలుగు, కందుకూరు, ఫిబ్రవరి 5)
కందుకూరు మాజీ ఎమ్మెల్యే మానుగుంట మహీధర్ రెడ్డిని ఆయన నివాసంలో నెల్లూరు పార్లమెంట్ వైసీపీ పరిశీలకులు ఆదాల ప్రభాకర్ రెడ్డి మధ్యాహ్నం భేటీ అయ్యారు. తాజా రాజకీయ పరిస్థితులు, ఇంకా పలు అంశాలపై ఇద్దరిమధ్య చర్చ జరిగినట్టు సమాచారం. కొంతకాలంగా వైసీపీకి దూరం పాటిస్తున్న మహీధర్ రెడ్డితో ఆదాల ప్రభాకర్ రెడ్డి సమావేశం కావడం ఆసక్తికరంగా మారింది. నెల్లూరు విజయ డైయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, ఇంకా పలువురు నేతలు ఆదాల ప్రభాకరరెడ్డి వెంట ఉన్నారు.

# గీత కులాల వారికి ఈ నెల 8 వరకు గడువు పెంపు



(షణ్ముఖ వెలుగు, కంభం, ఫిబ్రవరి 5)
గీత కులాల వారికి ప్రభుత్వం నూతన మద్యం దుకాణాల కోసం దరఖాస్తు గడువు ఈ నెల 5వ తేదీ వరకు ఉండగా, ప్రస్తుతం దరఖాస్తు స్వీకరణ ఈనెల 8వ తేదీ వరకు పెంచినట్లు కంభం ఎక్సైజ్, ప్రొహిబిషన్ ఇన్స్‌పెక్టర్ ఎస్ కొండారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

# క్లస్టర్ రీ ఆర్గనైజేషన్ పై కసరత్తు



(షణ్ముఖ వెలుగు, కంభం, ఫిబ్రవరి 5)
కంభం మండలంలో క్లస్టర్స్ పునర్నిర్మాణంపై స్థానిక ఎంఈవో కార్యాలయంలో సమాలోచనలు చేశారు. ఈ సందర్భంగా బుధవారం ప్రధానోపాధ్యాయుల సమావేశాన్ని నిర్వహించారు. ఎంఈవో మాల్యాద్రి మాట్లాడుతూ జీఓ 117 రద్దు నేపథ్యంలో పాఠశాలలను శాటిలైట్ స్కూల్స్, ఫౌండేషనల్ స్కూల్స్, బేసిక్ ప్రైమరీ, మోడల్ ప్రైమరి,హై స్కూల్స్ గా మార్పు చేస్తున్నట్లు తెలిపారు. విషయాన్ని తల్లిదండ్రులకు,స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ సభ్యులకు వివరించి పాఠశాల వారీగా అభ్యంతరాలను,అంగీకారాలను తీసుకోవాలన్నారు. అనంతరం డొక్కా. సీతమ్మ మధ్యాహ్న బడి భోజనాల నాణ్యత,నిర్వహణ, సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర వినియోగంపై ఆరా తీశారు.పాఠశాలల అభివృద్ధి,విద్యా ప్రణాళికలపై ప్రధానోపాధ్యాయులతో చర్చించారు. కార్యక్రమంలో క్లస్టర్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గని వెంకటేశ్వర్లు, పిఎన్ కాలనీ జెడ్పి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శామ్యూల్, రాచర్ల ఎంఈఓలు కోటేశ్వరరావు, గిరిధర శర్మ, తదితరులు పాల్గొన్నారు.

# వాహనాలు నడిపే వారంతా రహదారి భద్రత నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

## జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి





(షణ్ముఖ వెలుగు, బాపట్ల, ఫిబ్రవరి 5)
జాతీయ రహదారి మాసోత్సవాల్లో భాగంగా బాపట్ల పట్టణంలో బుధవారం అవగాహన ర్యాలీ జరిగింది. జిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. మున్సిపల్ ఉన్నత పాఠశాల నుంచి పాత బస్టాండ్ కూడలి వరకు సాగిన ర్యాలీలో జిల్లా కలెక్టర్ జె .వెంకట మురళి, ఎస్పీ తుషార్ డూడి అగ్రభాగాన నిలవడంతో ప్రత్యేకత సంతరించుకుంది. హెల్మెట్ ధారణ-ప్రాణానికి రక్షణ, అతివేగం-పొంచి ఉన్న ప్రమాదం అంటూ పోలీసులు, డ్రైవర్లు ప్లకార్డులు చేతబూని నినదించారు. రవాణా శాఖ సిబ్బంది, పోలీసులు, డ్రైవర్లు కలసి మానవహారం నిర్వహించారు. అనంతరం డ్రైవర్లతో జిల్లా కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. వాహనాలు నడిపే వారంతా రహదారి భద్రత నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ చెప్పారు. రహదారిపై వెళ్లేటప్పుడు మీ భద్రతతో పాటు ఎదుటివారి భద్రతను దృష్టిలో ఉంచుకోవాలని ఆయన సూచించారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం నేరమన్నారు. మీ వాహనాలను నడపడానికి ఎట్టి పరిస్థితుల్లో మైనర్లకు ఇవ్వరాదన్నారు. గంజాయి, మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు. అతివేగ ప్రయాణం ప్రమాదకరమన్నారు. చట్టాలపై అవగాహన ఉండాలన్నారు. ద్విచక్ర వాహనమైతే హెల్మెట్ ధరించాలని, కారు ప్రయాణమైతే సీటు బెల్టు తప్పనిసరిగా వేసుకోవాలన్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనాలు నడిపే యువత జాగ్రత్తలు పాటించాలన్నారు. డ్రైవర్లు వాహనాలు నడిపే సమయంలో నిర్లిప్తంగా ఉండరాదన్నారు. రాత్రివేళల్లో వాహనాలు నడిపేవారు తగిన విశ్రాంతి తీసుకోవాలన్నారు. ప్రమాదకరమైన మలుపుల వద్ద రహదారులపై హెచ్చరిక బోర్డులు గమనించి ప్రయాణించాలన్నారు. ప్రమాదాలు నివారించడానికే ప్రజలలో అవగాహన కల్పిస్తూ ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.ప్రమాదాలు నివారించడానికి రహదారి భద్రత నియమాలను పోలీసులు నిత్యం అమలు చేస్తూనే ఉన్నారని ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. రహదారులపై అధికంగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలను బ్లాక్ స్పాట్స్‌గా గుర్తించి ప్రత్యేక శ్రద్ధ పెట్టామన్నారు. ఆ ప్రాంతాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రోడ్డు ప్రమాదాలతో చాలా కుటుంబాలు నష్టపోతున్నాయనే విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. బాధిత కుటుంబాలకు జరిగే నష్టాన్ని ఎవరూ పూడ్చలేరన్నారు. ప్రజల్లో మరింత అవగాహన కల్పించడానికే ప్రతి ఏటా రహదారి భద్రత వారోత్సవాలను నిర్వహిస్తుంటామన్నారు. రహదారి భద్రత నియమాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లడానికి స్వచ్ఛంద సంస్థలు సహకరించాలని ఆయన కోరారు. చిన్న హెల్మెట్, సీట్ బెల్ట్ ప్రమాదాలలో ప్రాణాలను కాపాడతాయని, కుటుంబమంతా రోడ్డున పడకుండా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ విఠలేశ్వర్, రవాణా శాఖ అధికారి పరంధామరెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, బాపట్ల ఆర్డిఓ పిగ్లోరియా, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, ఎంవీఐలు, పోలీస్ అధికారులు, డ్రైవర్లు, తదితరులు పాల్గొన్నారు.

# ఆహార భద్రతా చట్టాన్ని అమలు చేసి నిత్యవసర వస్తువుల ధరలు నియంత్రించాలి

## ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి డిమాండ్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 5)
నిత్యం పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలను నియంత్రించి ఆహార భద్రత చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి డిమాండ్ చేశారు. స్థానిక సత్యనారాయణపురంలో నిత్యవసర వస్తువుల ధరలను నియంత్రించాలని కోరుతూ సంతకాల సేకరణ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్యవసర వస్తువుల ధరలు పెరుగుదలతో ప్రజలు పౌష్టికాహారానికి దూరం అవుతున్నారని అన్నారు. పోషక విలువలతో కూడిన ఆహారం అందుబాటులో లేక మహిళలు 57 శాతానికి పైగా రక్తహీనతతో బాధపడుతున్నారని అన్నారు. కుటుంబాలకు వస్తున్న ఆదాయాలకు మించి, ఆహారానికి ఖర్చులు పెరుగుతున్నాయని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల జీవన ప్రమాణాలను పట్టించుకునే స్థితిలో లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం చౌక ధరల దుకాణాలు ద్వారా కేవలం బియ్యము పంచదార మాత్రమే ఇస్తున్నారని అన్నారు. కేరళ లాంటి రాష్ట్రాలలో 16 రకాల నిత్యవసర వస్తువులు చౌక ధరల దుకాణం ద్వారా ప్రజలకు అందిస్తున్నారని అలాగే ఆంధ్రప్రదేశ్లో కూడా అందించాలని కోరారు. ఆహార భద్రత చట్టం ప్రకారం పౌష్టికాహారాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, హంగర్ ఇండెక్స్ లో దిగజారుతున్న దేశ పరిస్థితిని మెరుగుపరచాలని లక్ష్యంగా ఉందని తెలిపారు. ఆహార భద్రత చట్టాన్ని పాలకులు గాలికి వదిలేసారని, నిత్యవసర వస్తువులు ప్రజలకు అందుబాటులో లేని స్థితి ఏర్పడిందని అన్నారు. ప్రజలకు పౌష్టికాహారాన్ని అందించ కుండా కనీసం తాగటానికి మంచినీళ్ళు కూడా కల్పించే ప్రయత్నం చేయకుండా 99 రూపాయలకు నాణ్యమైన మద్యాన్ని అందిస్తాం అనటం సిగ్గుచేటైన విషయం అని అన్నారు. ఒకవైపు పెరుగుతున్న ధరలు, మరొకవైపు కుటుంబ సంపాదన మధ్యానికి పోతుంటే కుటుంబాలు గుల్ల పోతున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. కరెంట్ చార్జీలు పెంచమని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నేడు సర్దుబాటు చార్జీలు, ట్రూఅప్ చార్జీలు విపరీతంగా పెంచి ప్రజల మీద భారాలు మోపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్లో ధరల్లో నియంత్రణకు నిధిని కేటాయించి ఆహార భద్రత చట్టాన్ని కాపాడాలని, నిత్యవసర వస్తువుల ధరలను నియంత్రించాలని డిమాండ్ చేశారు. ఐద్వా నగర కార్యదర్శి జి.ఆదిలక్ష్మి మాట్లాడుతూ తామ అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని చెప్పిందని అన్నారు అధికారంలోకి వచ్చి 8 నెలలు గడుస్తున్నా పథకాల అమలుకు తగిన శ్రద్ధ చూపటం లేదని అన్నారు ముఖ్యంగా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ఆడబిడ్డకు 1500 ఇస్తానన్న మాట అమలులోకి తేలేదని అన్నారు. గ్యాస్ సిలిండర్ కు కూడా ముందస్తుగా డబ్బులు వేయకుండా ఎప్పుడో వేయటం అనేది సరికాదని అన్నారు. నిత్యవసర వస్తువుల ధరలతో పాటు పెట్రోల్ డీజిల్ గ్యాస్ తరలిన కూడా తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి ఐద్వా నాయకురాలు కె. రాజేశ్వరి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా సీనియర్ నాయకురాలు వై. ఆంజనీ దేవి ఐద్వా నాయకులు జి. కళ్యాణి, ఎస్ ఇంద్రజ్యోతి, డి శ్రీదేవి, ఎం అన్నపూర్ణమ్మ , కే ఈశ్వరమ్మ, డి శ్రీదేవి, కె కోటేశ్వరమ్మ, కె పద్మ, బి ఉష, యన్ హరిణి, ఎం తులసి, తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక వ్యతిరేక చట్టాలను ఉపసంహరించుకోవాలి




(షణ్ముఖ వెలుగు, కంభం, ఫిబ్రవరి 5)
కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్‌ను ఉపసంహరించుకోవాలని కోరుతూ స్కీం వర్కర్లకు, సంక్షేమ వేతనాల పెంపు కార్మికులకు వ్యతిరేకంగా ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ కు నిరసన తెలియజేస్తూ కంభం మండల సిఐటియు కమిటీ ఆధ్వర్యంలో కంభం తాసిల్దారు వారి కార్యాలయ ఆవరణంలో ధర్నా నిర్వహించి అనంతరం తాసిల్దారు కార్యాలయంలో మెమోరండం సమర్పించారు. ఈ ధర్నాను ఉద్దేశిస్తూ సిఐటియు నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి సంకీర్ణ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తరువాత కార్పొరేట్లకు అనుకూలంగా సంస్కరణలు అమలును మరింత వేగవంతం చేసిందని దానిలో భాగంగా కార్మికులు శతాబ్దాల తరబడి పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను కాలరాస్తూ 29 కార్మిక చట్టాలను రద్దు చేస్తూ నాలుగు లేబర్ కోడ్లను తీసుకొని వచ్చిందని ఈ లేబర్ కోడ్ అమలులోకి వస్తే కార్మికుల వేతనాలు సామాజిక భద్రత ఎనిమిది గంటల పని దినాలు కు విఘాతం కలుగుతుందని యూనియన్ పెట్టుకునే హక్కుసమ్మె హక్కు కోల్పోయే ప్రమాదం ఉంది. అలాంటి లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సిఐటియుగా డిమాండ్ చేస్తూ ఈ సంవత్సరం ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్లో కార్మికుల సంక్షేమం స్కీం వర్కర్స్ వేతనాల పెంపుదల ఉద్యోగ భద్రత అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమానికి తగిన చర్యలు నిధుల కేటాయింపు లేదని ధనికులకు కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా ఉండే బడ్జెట్ను కేటాయించి దేశంలో ఉన్న కార్మికుల సంపదను బడా బాబులకు దోచిపెట్టె ఈ బడ్జెట్ను వ్యతిరేకిస్తూ ధర్నా నిర్వహించటం జరిగింది. లేబర్ కోర్టులను వెంటనే రద్దు చేయని యెడల కార్మికుల కార్మికులను ఐక్యం చేసి పోరాటాలను ఉధృతం చేస్తామని ఈ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు ఎస్ కె అన్వర్, బి రోశయ్య, భవన నిర్మాణ కార్మికులు సంఘం నాయకులు కొత్తూరు మహబూబ్ బాషా, జెర్మియా, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు సిహెచ్ సత్యం, ఎన్ రాజు, ముఠాపలక రిక్షా వర్కర్స్ యూనియన్ గుర్రప్ప, ఎం శ్రీను, జే సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలోనే ఆదర్శంగా, ఐకానిక్ సిటీగా వినుకొండ అభివృద్ధి

## చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



(షణ్ముఖ వెలుగు, వినుకొండ, ఫిబ్రవరి 5)
రాష్ట్రంలోనే ఐకానిక్ సిటీగా వినుకొండను అన్ని ఆధునిక హంగులతో అభివృద్ధి చేస్తామని ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పేర్కొన్నారు. అడిగినన్ని నిధులు, అనుమతులు ఇవ్వడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు సిద్ధంగా ఉన్నారని, స్థానిక నాయకత్వాలు కూడా రాజకీయాలకు అతీతంగా కలసి వస్తే సమష్టిగా అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం వినుకొండ పట్టణంలో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక సదుపాయాలపై చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, మున్సిపల్ ఛైర్మన్ దస్తగిరి, కమిషనర్ సుభాష్ చంద్రబోస్, కౌన్సిలర్లు, అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు పట్టణానికి అందుబాటులో ఉన్న ఎన్నెస్పీ స్థలంలోని 21.49 ఎకరాల్లో తితిదే కల్యాణ మండపం, షాదీఖానా, పార్కు, ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్, జిమ్, గేమింగ్ జోన్, ముస్లిం మైనార్టీ కాలేజీ, పార్కింగ్ స్టాండ్, కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్, డిజిటల్ లైబ్రరీ తీర్చిదిద్దుతామన్నారు. 12 ఎకరాల్లో డిగ్రీ కళాశాల, 10 ఎకరాల్లో అవుట్ డోర్ స్టేడియం, క్రికెట్ మైదానంతో పాటు గ్యాలరీ ఏర్పాటును త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. అందుకు సంబంధించిన సర్వే పూర్తి చేసి బృహత్ ప్రణాళిక తయారు చేయాలని ఆదేశించారు. ఆంధ్ర క్రికెట్ సంఘం సహకారంతో క్రికెట్ స్టేడియం పూర్తి చేస్తామన్నారు. వ్యర్థాల నిర్వహణ ప్లాంట్ కూడా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వినుకొండ కూరగాయల మార్కెట్ వద్ద ఆధునాతన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ఇప్పటికే రూ.కోటి మంజూరు అయ్యాయని, ఆ దిశ గా మాస్టర్ ప్లాన్ తయారు చేసి త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు.



# కమ్మకండ్రీగా గ్రామంలో వేగంగా సిసి రోడ్ల నిర్మాణం

(షణ్ముఖ వెలుగు, దొరవారిసత్రం, ఫిబ్రవరి 5)
తిరుపతి జిల్లా దొరవారి సత్రం మండలం తనయాలి సచివాలయం పరిధిలో ఉన్న కమ్మకండ్రిగ గ్రామ పంచాయతీలో నందు ఏడు లక్షలకు టీడీపీ స్థానిక నాయకులు నేతృత్వంలో సి.సి రోడ్ల నిర్మాణం పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. అధికారులు రోడ్ల నిర్మాణం పనులను తనిఖీ చేసి, రోడ్లు వేగంగా నాణ్యతగా వెయిస్తున్న టిడిపి స్థానిక నాయకులు సచివాలయ ఇంజినీర్ అసిస్టెంట్ వి నిరోషా, అధికారులు అభినందించారు.



# మాదిగల సాగు భూముల్ని ఆక్రమించిన వారి పై
# ల్యాండ్ గ్రాబింగ్ కేసు పెట్టాలి



**వివాదం పేరుతో ఆక్రమణదారులకు అనుకూలంగా నిషేధాజ్ఞలు ఇవ్వటం సరికాదు**

**ఎమ్మెల్యే ఇంటూరి అండతోనే మాదిగల పై పల్లెకారుల వేధింపులు**

**ఉలవపాడు తహసిల్దారును డిమాండ్ చేసిన దళిత నీలం**

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 5)

చాకిచర్ల రెవిన్యూ గ్రామంలో మాదిగల సాగు భూమిని ఆక్రమించిన వ్యక్తుల పై ల్యాండ్ గ్రాబింగ్ కింద కేసు నమోదు చేయించాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు నీలం నాగేంద్రరావు ఉలవపాడు తహసిల్దారు లావణ్యవేణిని డిమాండ్ చేశారు. బుధవారం ఉలవపాడు వచ్చిన నీలం నాగేంద్రరావు తహసిల్దార్ లావణ్య వేణితో మాట్లాడారు. సర్వేనెంబర్ 926-1 లో 28 ఎకరాల 65 సెంట్ల సోషల్ ఫారెస్ట్ భూమి సాగు చేసుకుంటున్న అన్ని కులాల రైతులకు, 926-2లో 10 ఎకరాల ఫారెస్ట్ భూమిలో నివాసం ఉంటున్న పల్లె కులస్తులకు మధ్య 20 ఏళ్ళ క్రితం నాటి గ్రామ పెద్దలు కుదిరించిన ఒప్పందాన్ని నాగేంద్ర తహసిల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. నిజానికి సముద్రం ఒడ్డున ఉండే పల్లె కులస్తులు 2004 లో వచ్చిన తుఫాను తరువాత తమ పాత ఇళ్లకు ఎగువన ఉన్న సర్వే నెంబరు 926-2లోని 10 ఎకరాల ఫారెస్ట్ భూమిలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారన్నారు. ఇందుకు సంబంధించిన ఆధారాలు చూపారు. పల్లెకారులు సర్వే నెంబరు 926-2 భూమిలోకి రాక మునుపు వందల ఏళ్ళ క్రితమే, సర్వే నెంబరు 926-1 లోని సోషల్ ఫారెస్ట్ భూమిని అన్ని కులాల స్థానిక రైతులు ఎవరి పొలానికి ఎదురుగా వారు సాగు చేసుకున్నారన్నారు. ఇందుకు సంబంధించిన ఆధారాలను తహసిల్దార్‌కు చూపారు. పల్లెకారులు స్థానిక రైతుల సాగులో ఉన్న భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నించగా, ఆనాటి పెద్దలు డొంకకు తూర్పుగా స్థానిక రైతులు, డొంకకు పడమరగా పల్లెకారులు వెళ్లకూడదని ఒప్పందం చేశారన్నారు. అప్పటినుంచి ఆ ఒప్పందం అమల్లో ఉందన్నారు. అయితే కొందరు పల్లె కారులు కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అండతో సామాజికంగా అండలేని మాల, మాదిగల భూమిని ఆక్రమించేందుకు అనేక ప్రయత్నాలు చేశారన్నారు. గతంలో దార్ల కోటేశ్వరరావు, సుదర్శి సుదర్శరాయుడులను కొట్టారన్నారు. ఈ ఘటనపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు అయిందన్నారు. మరలా 2023లో వీరమల్లు కొండయ్య భూమిలో పేడ దిబ్బలు తోలి సాగుకు ఆటంకం కల్పించి, కొండయ్యను అప్పాటి వెంకటేశ్వర్లు తదితరులు కొట్టారన్నారు. ఈ ఘటనపై కూడా ఉలవపాడు పోలీసులు క్రైమ్ నెంబర్ 177/2023 ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేశారన్నారు. రెండు ఎస్సీ ఎస్టీ కేసులు నమోదై కోర్టు చుట్టూ తిరుగుతున్నా, మాల మాదిగలు భూములు సాగు చేసుకోవటం సహించలేని పల్లెకారులు కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అండతో మాల మాదిగలకు ఆటంకాలు సృష్టిస్తున్నారన్నారు. క్రైమ్ నెంబర్ 177/2023 ఎస్సీ ఎస్టీ కేసు రాజీ పడాలని, కొండయ్యను ఆవుల వాసు, చింతా రాజారావు, వెయ్యల అశోకులు బెదిరించారన్నారు. పోలీసులను అడ్డం పెట్టుకొని మాదిగలను భయపెట్టి, భూములనుంచి మాదిగలను వెళ్ళగొట్టాలని చూసారన్నారు. అయితే తాను అండగా నిలవడంతో, తహసిల్దార్ ద్వారా మాదిగల సాగు చేసుకుంటున్న భూమిలోకి మాదిగలు ప్రవేశించకూడదని నిషేధాజ్ఞలు ఇప్పించేందుకు నోటీసులు సిద్ధం చేశారన్నారు. మాదిగల సాగు భూమిని డిస్ప్యూట్ ల్యాండ్ గా చిత్రీకరించాలని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు నోటీసులు తయారు చేస్తున్నారన్నారు. వాస్తవాలను విచారించి, ఆధారాలను పరిశీలించి నిర్ణయం తీసుకుంటానని తహసిల్దార్ లావణ్య వేణి నీలం నాగేంద్రకు హామీ ఇచ్చారు. తహసిల్దార్ ను కలిసిన వారిలో పుల్లా కిరణ్ రెడ్డి, వీరమల్లు కొండయ్య, మాల మహానాడు అధ్యక్షులు దారా అంజయ్య, కాకుమాను రవి, చాకిచెర్ల, రైతులు ఉన్నారు.

# ఏకాంబరం మస్తాన్ పై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలి

**యాదవ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షులు మిరియం శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షులు చిరుమామిళ్ల గోపి కృష్ణ యాదవ్**



(షణ్ముఖ వెలుగు, కందుకూరు, ఫిబ్రవరి 5)

గత నెల 29వ తేదీ కందుకూరు పట్టణంలోని పోస్ట్ ఆఫీస్ దగ్గర గల ఈతముక్కలమ్మ దేవాలయం వద్ద యాదవ యువకుడిపై దాడి చేసిన ఏకాంబరం మస్తాన్ పై పోలీసు వారు కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని ఉమ్మడి ప్రకాశం జిల్లా యాదవ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షులు మిరియం శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షులు చిరుమామిళ్ల గోపి కృష్ణ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. కందుకూరులోని పడమర యాదవ కాలనీలో నివసిస్తున్న అమ్మనబోయిన సుబ్బారావు అనే వ్యక్తి పేకాటకు అలవాటు పడి లక్షల అప్పులపాలై జీవితాన్ని సర్వ నాశనం చేసుకుని ఉన్న సందర్భంగా బాడుగ ఆటో తీసుకొని తన కుటుంబాన్ని పోషించుకుంటుండగా గతంలో పేకాటలు ఏకాంబరం మస్తాన్‌కు డబ్బులు బాకీ పడి ఉన్నందున గత నెల 29వ తేదీ నాడు కందుకూరు పోస్ట్ ఆఫీస్ వద్దగల ఈతముక్కలమ్మ గుడి వద్ద పాసింజర్‌ని ఎక్కించుకొని ఆటోలు పోతుండగా మస్తాన్ బండి ఆపి పాసింజర్ దింపి ఆటో నడుపుతున్న సుబ్బారావు బయటికి లాగి దాడి చేయగా చుట్టుపక్కల వారు చూశారని అవమానానికి గురై పురుగుల మందు తాగి ప్రాణాపాయ స్థితిలో ఉన్న సుబ్బారావును బుధవారం కందుకూరు ప్రభుత్వ హాస్పిటల్ నందు పరామర్శించారు. యాదవ జేఏసీ నాయకులు వెంటనే మస్తాన్ అరెస్ట్ చేయాలని శ్రీనివాసులు గోపి కృష్ణ యాదవ్ డిమాండ్ చేశారు. కందుకూరు పట్టణంలో జూదం ఆడే వారికి కొంతమంది నూటికి పది రూపాయలు వడ్డీలకిస్తూ సమయానికి అసలు వడ్డీ చెల్లించలేని వారిపై భౌతిక దాడులు చేస్తున్న వారిపై పోలీసు వారు కఠినముగా వ్యవహరించాలని వారు పోలీసు వారికి విజ్ఞప్తి చేశారు. పేకాట ఆడుతున్న వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి జూదం ఆడుతున్న వారి కుటుంబాలు బజారు పడకుండా పోలీసు వారు కఠినంగా వ్యవహరించాలని అన్నారు. కందుకూరు పట్టణంలో రోజుకు 100 రూపాయలకు 10 రూపాయల వడ్డీ చొప్పున జూదం ఆడేటువంటి వ్యక్తులకు డబ్బులు ఇస్తూ నిలువు దోపిడీ చేస్తున్న వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవాలని శ్రీనివాసులు, గోపికృష్ణ తెలిపారు.

## 9న సాహిత్యరత్న స్వర్గీయ పబ్బిశెట్టి వెంకటేశ్వర్లు సంస్మరణ సభ

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 5)

ఒంగోలులోని మల్లయ్య లింగం భవనం(సిపిఐ ఆఫీస్) మొదటి అంతస్తులో ఫిబ్రవరి 9తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు "సాహితీ రత్న" కీ.శే. పబ్బిశెట్టి వెంకటేశ్వర్లు సంస్మరణ సభ కళామిత్ర మండలి (తెలుగులోగిలి) ఆధ్వర్యంలో జరుగుతుందని సంస్థ జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ నూనె అంకమ్మరావు, సింహాద్రి జ్యోతిర్మయిలు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షులు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, నరసం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ళ అరుణ,సహజకవి శనగపల్లి సుబ్బారావుతోపాటు ఆత్మీయ అతిథులుగా శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సమితి అధ్యక్షులు కుర్రా ప్రసాద్ బాబు, ప్రముఖ సాహితీవేత్త,కవి యు.వి రత్నం,బాల సాహితీవేత్త మద్దిరాల శ్రీనివాసులు, ప్రకాశం జిల్లా రచయితల సమాఖ్య గౌరవ అధ్యక్షులు మిడసల మల్లికార్జునరావు, కోశాధికారి డా.సంతవేలూరి కోటేశ్వరరావు, హిందీ ఉపాధ్యాయులు ఆళ్ళచెరువు సాంబశివరావు తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖులైన రాయపాటి ఆశీర్వాదం, నిమ్మల వెంకయ్య, పిన్ని వెంకటేశ్వర్లు, మహతి తన్నీరు బాలాజీ, కప్పగంతు జయరామయ్య, ఆళ్ళ వెంకటేశ్వర్లు, డి.వి.యస్ రామాచార్యులు, నర్సింగోలు శ్రీనివాస ప్రసాద్, యం సూర్యకుమారి, చల్లా నాగేశ్వరమ్మ, డాక్టర్ మున్నంగి రాజకుమారి, ఆదూరి మనోహర, జంధ్యాల కామేశ్వరి, పరాంకుశం కృష్ణవేణి, ఉప్పుటూరి మాధవ, మద్దిరాల సాంబశివరావు, షేక్ మగ్బుల్ అలీ, ఉబ్బా అశోక్ బాబు, నారాయణం రఘు ప్రదీప్, బి శ్రీనివాసరావు, షేక్ సంధానీలను ఘనంగా సత్కారిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి కోవెలకుంట్ల బాలకోటయ్య బీరం అరుణ, ఓరుగంటి ప్రసాద్, కందుల మధు తదితరులు నిర్వహణ సహకారాన్ని అందిస్తారని తెలిపారు.

## హెల్మెట్ పెట్టుకోండి ప్రాణాలు కాపాడుకోండి

(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఫిబ్రవరి 5)

స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో బుధవారం ద్విచక్ర వాహనంపై వెళ్లే వారికి ఎస్ఐ అనుక్ కౌన్సిలింగ్ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ మన ప్రాణం కోసం మనమే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, హెల్మెట్ లేకుండా వాహనాలు నడపవద్దని తద్వారా ప్రమాదాల కొని తెచ్చుకుని ఇటు వ్యక్తిగతంగా అటు కుటుంబపరంగా ఇబ్బందులు తెచ్చుకోవద్దన్నారు. ద్విచక్ర వాహనంపై వెళ్లేవారు తప్పనిసరిగా హెల్మెట్



ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని, ట్రిపుల్ రైడింగ్, రాష్ డ్రైవింగ్ చేయరాదని, డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సి తప్పనిసరిగా ఉండాలని వాహనదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ద్విచక్ర వాహనదారులు పాల్గొన్నారు.

# రైతులకు కనీస మద్దతు ధర లభించేలా పర్యవేక్షించాలి

**అధికారులను ఆదేశించిన కలెక్టర్ ఆనంద్**



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఫిబ్రవరి 5)

నెల్లూరు జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమవుతున్న నేపథ్యం రీలో రైతులకు ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర తగ్గకుండా విక్రయించుకునేలా వ్యవసాయశాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధతో క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. బుధవారం ఉదయం కలెక్టరు వారి చాంబర్‌లో వ్యవసాయ అనుబంధశాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా త్వరలో మొదలుకానున్న ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర దక్కేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలన్నారు. ఈ క్రాప్‌ను ఈనెల 25లోగా పూర్తి చేయాలన్నారు. సిసిఆర్‌సి కార్డులు పొందిన కౌలురైతులకు అవసరమైన బ్యాంకు రుణాలను మంజూరు చేయించాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేలా జిల్లా సహకారశాఖ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన ప్రాథమిక వ్యవసాయ కోపరేటివ్ సొసైటీల్లో పురుగుమందు రహిత వ్యవసాయ ఉత్పత్తుల స్టాళ్ల ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. త్వరలో దగదర్తిలోని పిఎసిఎస్‌లో పురుగుమందు రహిత వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను ఏర్పాటు చేయనున్నట్లు డిసివో గుర్రప్ప కలెక్టర్‌కు తెలిపారు. పైలెట్ ప్రాజెక్టుగా మార్కెటింగ్‌శాఖ పరిధిలో ఒక గోడౌన్, సహకారశాఖ ఆధ్వర్యంలోని ఒక గోడౌన్‌ను జాతీయ గోదాముల అభివృద్ధి ప్రాధికార సంస్థ, న్యూఢిల్లీ వారి గుర్తింపు పొందేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. దీని ద్వారా రైతులకు ఎన్నో ఉపయోగాలున్నాయని కలెక్టర్ చెప్పారు. విడతలవారీగా అన్ని గోడౌన్లకు ఈ గుర్తింపు లభించేలా చర్యలు చేపట్టాలని మార్కెటింగ్, సహకారశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఐదువేల హెక్టార్లలో డ్రిప్ ఇరిగేషన్ లక్ష్యంగా కాగా ఇప్పటికే మూడువేల ఎకరాల్లో డ్రిప్ పరికరాలు అమర్చినట్లు ఎపిఎంఐపి పిడి శ్రీనివాసులు కలెక్టర్‌కు వివరించారు. మిగిలిన 2వేల ఎకరాల డ్రిప్ పరికరాల ఏర్పాటు లక్ష్యాన్ని త్వరగా అధిగమించాలని కలెక్టర్ సూచించారు. వ్యవసాయ అనుబంధశాఖలన్నీ రైతులకు మేలు జరిగేలా నిర్దేశిత లక్ష్యాలను చేరుకునేందుకు ప్రత్యేకంగా కృషి చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి సత్యవాణి, మత్స్యశాఖ జెడి నాగేశ్వరరావు, డిసివో గుర్రప్ప, పశుసంవర్ధకశాఖ జెడి రమేష్‌నాయక్, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి సుబ్బారెడ్డి, ప్రకృతి వ్యవసాయ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ మాలకొండయ్య, మార్కెటింగ్‌శాఖ ఎడి అనిత, మార్క్‌ఫెడ్ డిఎం పవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



## అయోధ్య రామ మందిర నిర్మాణ నమూనా





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 5)

సనాతన ధర్మాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో అయోధ్య రామ మందిరం నిర్మాణం నమూనాని అన్నా చెల్లి అయిన పొదిలి ఉద్విప్ కుమార్, జయశ్రీ అత్యంత అద్భుతంగా తయారు చేశారు. అయోధ్య రామ మందిరం నమూనాను బుధవారం మంగమ్మ కాలేజీలో జరిగిన అష్టోత్తర శతగో పూజ మహోత్సవంలో ప్రజలు చూచుటకు ఏర్పాటు చేశారు. రామ మందిరం చూచేందుకు భక్తులు ఆసక్తి చూపారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్, సౌజన్య పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ పర్వతరెడ్డితో వైసీపీ నేతల భేటి



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఫిబ్రవరి 5)

నెల్లూరు రాంజీ నగర్ ఆఫీస్‌లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇంచార్జ్ ,ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డిని 8వ డివిజన్ వైసిపి నాయకులు ఆర్‌కే నగర్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా డివిజన్ సమస్యల పై చంద్రశేఖర్‌రెడ్డితో వారు చర్చించారు. డివిజన్‌లో పార్టీకి లభిస్తున్న ఆదరణను చంద్రశేఖర్ రెడ్డికి తెలియజేసి పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు.

## మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని కలిసిన జిల్లా కలెక్టర్ ఆనంద్





(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఫిబ్రవరి 5)

రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని జిల్లా కలెక్టర్ ఆనంద్ మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం ఉదయం నగరంలోని మంత్రి క్యాంపు కార్యాలయానికి విచ్చేసిన కలెక్టర్ ఆనంద్‌తో మంత్రి ఆనం పలు విషయాలపై చర్చించారు. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మంత్రికి కలెక్టర్ వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వేగవంతం చేసి ప్రజలకు త్వరగా చేరువయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు మంత్రి సూచించారు. జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్ళడానికి కృషి చేయాలని కోరారు. జిల్లాలో పథకాల అమలులో ఎదురవుతున్న సమస్యలు, పెండింగ్ పనులు, సోమశిల ప్రాజెక్టు సంబంధిత పనులు, ఆత్మకూరు నియోజకవర్గంలో జరిగే పలు అభివృద్ధి కార్యక్రమాలు తదితర అంశాలపై చర్చించారు. ప్రధానంగా విద్యారంగంలో రానున్న నూతన విధానాలపై చర్చించారు. ఈ సందర్భంగా సోమశిల ప్రాజెక్టు చైర్మన్ కేశవ చౌదరి జిల్లా కలెక్టర్‌ను శాలువాతో సన్మానించారు.

## ఆత్మకూరు గ్రామంలో పొలం పిలుస్తుంది

### వ్యవసాయ అధికారిని బి తిరుమల జ్యోతి





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఫిబ్రవరి 5)
మండల పరిధిలోని ఆత్మకూరు గ్రామంలో బుధవారం వ్యవసాయ అధికారిని బి తిరుమల జ్యోతి ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా వరి రైతులు మెడ విరుపు తెల్ల కంకి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురండి తెలిపారు. పెసరలో మూడు తెగులు, లద్దె పురుగు నివారణ చర్యలు గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆత్మకూరు గ్రామ రైతులు, గ్రామ వ్యవసాయ సహాయకులు షేక్ షరీఫుద్దీన్ హాజరవడం జరిగింది.

## పొలం పిలుస్తుందిలో రైతులకు సూచనలు

(షణ్ముఖ వెలుగు, మర్రిపూడి, ఫిబ్రవరి 5)







మండలంలోని కూచిపూడి, జువ్విగుంట గ్రామాలలో వ్యవసాయ అధికారి వెంకటేష్ ఆధ్వర్యంలో రైతు సేవా కేంద్రాల వద్ద పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి వెంకటేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మన రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఫార్మర్ రిజిస్ట్రీని తీసుకుని వచ్చిందని, రాబోవు రోజుల్లో భవిష్యత్ అవసరాల మేరకు తప్పనిసరిగా మండలంలోని రైతులందరూ ఈ ఫార్మర్ రిజిస్ట్రీని చేయించుకుని 14 అంకెల నెంబర్‌ని ప్రతి ఒక్క రైతు కలిగి ఉండాలని తెలియజేశారు. రైతులందరూ మీకు దగ్గరలోని రైతు సేవా కేంద్రాల వద్ద ఫార్మర్ రిజిస్ట్రీని చేయించుకోవాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా కందులు కొనుగోలుకు సంబంధించి క్వింటాల్ కి ప్రభుత్వ మద్దతు రూ.7550 గా నిర్ణయించారని, ముందుగా రైతులు స్థానిక రైతు సేవా కేంద్రాల వద్ద సీఎం ఏపీపీ కందుల కొనుగోలుకు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని రైతులకి సూచించారు. ఈ కార్యక్రమంలో విస్తరణాధికారి కోటేశ్వరరావు, కూచిపూడి గ్రామ వ్యవసాయ సహాయకులు మని కృష్ణ, జువ్విగుంట గ్రామ వ్యవసాయ సహాయకులు విజయ్, జువ్విగుంట వెటర్నరీ అసిస్టెంట్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాలలో ఓపెన్ డే కార్యక్రమం




(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఫిబ్రవరి 5)
మండల కేంద్రమైన ఉలవపాడు జి.వి.ఎస్.ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం రోజున ఓపెన్ డే ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి తెలుగు అధ్యాపకులు వై సుధాకరబాబు మాట్లాడుతూ ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నటువంటి విద్యార్థినీ, విద్యార్థులకు నూతన విద్యా విధానం ద్వారా డిగ్రీ స్థాయిలో వస్తున్నటువంటి మార్పుల పట్ల అవగాహన కల్పించడం, మా కళాశాలలో ఉన్న ఆధునిక సౌకర్యాలను విద్యార్థులకు ప్రత్యక్షంగా వివరించటం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని తెలియజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి లక్ష్మీ సుధారాణి మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్యను ప్రభుత్వ విద్యాసంస్థల ద్వారా అందజేస్తున్నారని, వాటిని ఉలవపాడు పరిసర ప్రాంత విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. తదనంతరం అధ్యాపకులు కళాశాలలోని వివిధ విభాగాలను, ప్రయోగశాలలను, వర్చువల్, డిజిటల్ తరగతులను, గ్రంథాలయము, జిమ్ మరియు కంప్యూటర్ ల్యాబులను చూపించి వాటి గురించి విద్యార్థులకు వివరించడం జరిగింది. ఈ ఓపెన్ డే ప్రోగ్రాంలో స్థానిక జివిఎస్ఎం జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక సిబ్బంది అందరికీ డిగ్రీ కళాశాల తరపున కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, జూనియర్ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

# వ్యవసాయ రంగాన్ని కార్మికుల హక్కులను కాలరాసే బడ్జెట్

**కార్పొరేట్ శక్తులకు అనుకూలమైన బడ్జెట్**
**ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే బడ్జెట్**
**పేదలను మరింత పేదలుగా మార్చే బడ్జెట్**
**రైతు సంఘాలు, కార్మిక సంఘాలు, ప్రజా సంఘాల నాయకుల ధ్వజం**
**సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో విజయవంతంగా కేంద్ర బడ్జెట్ ప్రతుల దగ్ధం**

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 5)
కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ వ్యవసాయ రంగాన్ని తూట్లు పొడిచేలా ఉందని, కార్మిక హక్కులను కాలరాసి మరింత బానిసలుగా మార్చేలా ఉందని, అన్ని వర్గాల ప్రజలకు ఇది వ్యతిరేక బడ్జెట్ అని రైతు సంఘాల నాయకులు, కార్మిక సంఘాల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు ధ్వజమెత్తారు. కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో బడ్జెట్ ప్రతుల దగ్ధం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముందుగా కలెక్టరేట్ ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద నుండి చర్చి సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం కలెక్టరేట్ ఎదుట బడ్జెట్ ప్రతులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకు వస్తున్న ప్రజా వ్యతిరేక ఆర్థిక విధానాలను ఎండగట్టారు.కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి బాలకోటయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు వ్యతిరేకమైన బడ్జెట్ అన్నారు. కార్పొరేట్ శక్తులకు అనుకూలమైన బడ్జెట్ అన్నారు. 70 శాతం ప్రజలు ఉన్న వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసే బడ్జెట్ అన్నారు. ఉపాధి హామీ పథకానికి తూట్లు పొడిచే బడ్జెట్ అన్నారు. పిడిఎస్‌యు రాష్ట్ర నాయకులు రాజశేఖర్ మాట్లాడుతూ ఇది పూర్తిగా ప్రజా వ్యతిరేక బడ్జెట్ అన్నారు. నిరుద్యోగం దేశంలో మరింతగా పెంచేదిగా ఉందన్నారు. ఏడాదికి కోటి ఉద్యోగాల హామి ఎక్కడ అన్నారు. భీమా రంగంలోకి విదేశీ పెట్టుబడిలను తీసుకువచ్చి ఆ రంగాన్ని నిర్వీర్యం చేసేలా బడ్జెట్లో అడుగులు ఉన్నాయన్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శి కల్పన మాట్లాడుతూ బడ్జెట్లో స్కీం వర్కర్లు గాని, ఆశ వర్కర్లకు గాని, అంగన్వాడి వర్కర్లకు గాని, అసంఘటిత రంగ కార్మికులకు గాని ఎటువంటి కేటాయింపులు లేవు అన్నారు. వారి జీవితాలను మరింత దారుణంగా మలిచేలా కేటాయింపులు ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ ఐ టియుసి జిల్లా నాయకులు ఉప్పుటూరు



ప్రకాష్ రావు మాట్లాడుతూ బడ్జెట్లో కేంద్ర ప్రభుత్వం రాతపూర్వకంగా ఇచ్చిన రైతాంగం పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు, చట్టబద్ధత లేవని, అలాగే నాలుగు లేబర్ కోడ్ లు తీసుకురావడం ద్వారా కార్మికులను మరింత బానిసలుగా మార్చే విధంగా బడ్జెట్ కేటాయింపులు ఉన్నాయన్నారు. దోపిడి వ్యవస్థను మరింత పెంచి పోషించేలా బడ్జెట్ ఉందన్నారు. ఐద్వా నాయకురాలు కంకణాల రమాదేవి మాట్లాడుతూ దేశంలో నానాటికి పెరుగుతున్న రైతుల ఆత్మహత్యలు నివారించేందుకు వ్యవసాయ రంగానికి తగిన కేటాయింపులు లేవని అన్నారు. కేవలం కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టెందుకే బడ్జెట్ కేటాయింపులున్నాయన్నారు. ఏఐఎఫ్టియు న్యూ జిల్లా నాయకులు ఎం ఎస్ సాయి మాట్లాడుతూ ఇది రైతులకు, కార్మికులకు వ్యతిరేక బడ్జెట్ అన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు, చట్టబద్ధత అంశాలు బడ్జెట్లో లేవన్నారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేలా బడ్జెట్లో కేటాయింపులు తగ్గించానన్నారు. ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు చావలి సుధాకర్ రావు మాట్లాడుతూ ఇది రాజ్యాంగ వ్యతిరేక బడ్జెట్ అన్నారు. జిఎస్టి పేరుతో 80 శాతం గా ఉన్న పేద ప్రజల నుండి వసూలు చేసిన పన్నును కేవలం మూడు శాతంగా ఉన్న కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టే విధంగా బడ్జెట్ కేటాయింపులు ఉన్నాయన్నారు. విద్యా, వైద్యాలకు కేటాయింపులు భారీగా తగ్గించారన్నారు. వ్యాపార వర్గాలకు మేలు చేసేలా బడ్జెట్ ఉందన్నారు. ఐఎఫ్టియు జిల్లా నాయకులు ఆర్ మోహన్ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్లో 12 లక్షల కోట్లు అప్పులు కట్టేందుకే సరిపోతుందన్నారు. అత్యధిక ఆదాయం వస్తున్న వ్యవసాయ రంగానికి తగిన కేటాయింపులు లేకపోవడం దుర్మార్గమన్నారు. కార్మిక వర్గాన్ని పట్టు బానిసలుగా మార్చే బడ్జెట్ అన్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శి జి. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇది పూర్తిగా మోడీ మార్క్ బడ్జెట్ అన్నారు. ఎన్నికల జరుగుతున్న రాష్ట్రాలకు అత్యధిక ప్యాకేజీలు ఇస్తూ, రెండు తెలుగు రాష్ట్రాలకు మొండి చెయ్యి చూపారు అన్నారు. వెనుకబడిన ప్రకాశం జిల్లాకు పదివేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. రెడ్ స్టార్ జిల్లా కార్యదర్శి భీమవరపు సుబ్బారావు మాట్లాడుతూకేంద్రంలో బిజెపి ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్మికులకు, రైతాంగానికి, పేద ప్రజలకు వ్యతిరేక బడ్జెట్ అన్నారు. సామాజిక రంగానికి కేవలం 60వేల కోట్లు మాత్రమే కేటాయించడం దుర్మార్గమన్నారు. దీనివల్ల సమాజంలో సామాజిక అసమానతలు మరింతగా పెరుగుతాయి అన్నారు.

ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కే. వీరారెడ్డి మాట్లాడుతూ దేశానికి అన్నం పెడుతున్న రైతాంగానికి బడ్జెట్లో తగిన నిధులు కేటాయించకపోవడం అన్నారు. రైతులు వారి సాగు చేస్తున్న భూములలోనే కూలీలుగా మార్చే విధంగా బడ్జెట్ కేటాయింపులు ఉన్నాయన్నారు. విశాఖ ఉక్కు కు సొంత గనులు కేటాయించాలన్నారు. పోలవరం ప్రాజెక్టుకు నిధులు పెంచాలన్నారు. ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పమిడి వెంకటరావు మాట్లాడుతూ బడ్జెట్ పూర్తిగా కార్పోరేషన్ శక్తులకు ఉపయోగపడేలా ఉందన్నారు. వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసేలా ఉందన్నారు. రైతాంగం పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు గానీ, పెట్టుబడి సాయం గాని, రుణ విమోచన కు కాని ఎటువంటి హామీలు లేవన్నారు.

నాలుగు లేబర్ కోడ్ ల వల్ల కార్మికులు తమ హక్కులను పూర్తిస్థాయిలో కోల్పోతారన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కంకణాల ఆంజనేయులు, కే ఎన్ పి ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జార్జి, సూపర్నెంట్ ఇంజనీర్ ఆవుల సుబ్రహ్మణ్యం, సామాజికవేత్త, కవి పిన్నికి శ్రీనివాసరావు, ఏఐటీయూసీ, సిఐటియు, ఐ ఎఫ్ టి యు, ఏఐఎఫ్టియు నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా నిర్వహించాలి

### ఆదేశించిన జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి

(షణ్ముఖ వెలుగు, బాపట్ల, ఫిబ్రవరి 5)
ఎమ్మెల్సీ ఎన్నికలను సజావుగా నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి నోడల్ ఆఫీసర్లను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ ప్రాంగణం లోని సమావేశం హాల్ లో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై తీసుకోవాల్సిన చర్యల గురించి నోడల్ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లా బాపట్లలో ఎమ్మెల్సీ ఎన్నికలు 12 మండలాల్లో జరుగుతాయని ఆయన చెప్పారు. ఎన్నికల సంఘం ఎమ్మెల్సీ ఎన్నికలకు ఫిబ్రవరి 3వ తేదీన నోటిఫికేషన్ జారీ చేయడం జరిగిందని ఆయన చెప్పారు. బాపట్ల జిల్లాకు సంబంధించి 12 మండలాల్లో ఫిబ్రవరి 27వ తేదీన ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతా యని అని చెప్పారు. ఉమ్మడి గుంటూరు జిల్లా బాపట్ల పరిధిలోని 12 మండలాల్లో మార్చి 8వ తేదీ వరకు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు లోఉంటుంద ని ఆయన తెలియ జేశారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి పగడ్బందీగా అమలు చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు కేటాయించిన నోడల్ ఆఫీసర్లు వారికి అప్పజెప్పిన బాధ్యతలను పారదర్శకంగా అమలు చేయాలని ఆయన చెప్పారు. బాపట్ల జిల్లా ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగే 12 మండలా లలో 28 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని ఆయన చెప్పారు. జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికలకు 24వేల 440 మంది గ్రాడ్యుయేట్స్ ఓటు హక్కును వినియో గించుకోనున్నారని ఆయన చెప్పారు. వీరిలో పురుషులు 15వేల 292 మంది, మహిళలు 9వేల150 మంది థర్డ్ జెండర్ ఐదుగురు ఉన్నారని ఆయన తెలియ జేశారు. పోలింగ్ కేంద్రాలలో ఓటర్లకు ఇబ్బందులు లేకుండా మౌలిక సౌకర్యాలు కల్పించాలని రెవెన్యూ డివిజనల్ అధికారు లనుఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి.జి గంగాధర్ గౌడ్, జిల్లా అదనపు ఎస్.పి విఠలేశ్వర్ , ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాసరావు, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ పద్మజ, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయలక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రాజ్ దిబోరా, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రామకృష్ణ, గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ వై వెంకటేశ్వరరావు, బాపట్ల రెవిన్యూ డివిజనల్ అధికారి గ్లోరియా, రేపల్లె రెవిన్యూ డివిజన్ అధికారి రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.





## పిల్లలందరికీ ఆల్బెండజోల్ ట్యాబ్లెట్లను తప్పనిసరిగా ఇవ్వాలి

### జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి





(షణ్ముఖ వెలుగు, బాపట్ల, ఫిబ్రవరి 5)
బాపట్ల జిల్లాలో 0 నుండి 18 సంవత్సరాల వయస్సు లోపు పిల్లలందరికి ఆల్బెండజోల్ టాబ్లెట్లను తప్పనిసరిగా ఇవ్వాలని జిల్లా కలెక్టర్ జె .వెంకట మురళి అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ లోని సమావేశం హాల్ లో జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా చేపట్టవలసిన చర్యలపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారు లతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ నులిపు రుగుల దినోత్సవం సందర్భంగా ఈ నెల 10వ తేదీన అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో, పాఠశాలల్లో పిల్లలకు నులిపురుగుల మందులను పంపిణీ చేయాలని ఆయన చెప్పారు. జిల్లాలోని అన్ని అంగన్ వాడి కేంద్రాల్లో ,ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల10వ తేదీన విద్యార్థులు హాజరయ్యే విధంగా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జి. గంగాధర్ గౌడ్, ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాసరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

# పేదలను నిర్మూలించే పద్ధతిలో బడ్జెట్

### – ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం – జిల్లా ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు

(షణ్ముఖ వెలుగు, హనుమంతునిపాడు, ఫిబ్రవరి 5)
కేంద్ర ప్రభుత్వం అట్టహాసంగా ప్రవేశపెట్టిన అటువంటి బడ్జెట్ పేదలను నిర్మూలించే పద్ధతిలో ఉంది తప్ప పేదరిక నిర్మూలన అనేది కనపడటం లేదని కాకులను కొట్టి గద్దలకేసి ఈ బడ్జెట్ పేదల వ్యతిరేక బడ్జెట్ అని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు ఆరోపించారు హనుమంతుని పాడు మండల కేంద్రంలో తాసిల్దార్ కార్యాలయం ఎదుట బడ్జెట్ పత్రాల దగ్ధ కార్యక్రమంతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ సమాజంలో అసమాన తలను ఎదుర్కొంటూ అసాంఘిక దుర్మార్గ చర్యలకు బలి అవుతున్నటువంటి దళితులను విస్మర్శించింది అని తెలిపారు గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయ కార్మికులకు గ్రామీణ కూలీలకు కార్మికులకు ఉపాధి చూపిస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి నిధులు పెంచలేదని కనీసం రెండు లక్షల కోట్లు నిధులు వెచ్చిస్తే తప్ప లక్ష్యం నెరవేరదని ఆర్థికవేత్తలు సామాజికవేత్తలు చెబుతున్నప్పటికీ కేంద్రం పెడచెవిన పెట్టిందని ఆరోపించారు నేటికీ వ్యవసాయ రంగం కీలకంగా దేశంలో ఉందని వ్యవసాయ ఆధారిత ఉపాధి ప్రజలకు ప్రధానమైన వనరుగా ఉందని వ్యవసాయ రంగానికి కేటాయించిన నిధులు మాత్రం కంటి తుడుపు చర్యలు అన్నారు నడికుడి శ్రీకాళహస్తి రైల్వే లైన్‌కు కేటాయింపుల్లో కేంద్ర ప్రభుత్వ పథకాలు అమలకు కేటాయింపుల్లో ప్రధానంగా యువతకు ఉపాధి కల్పనలో పారిశ్రామిక నిర్మాణ రంగంలో రాష్ట్ర విభజన హామీలు అమలులో తీవ్ర జాప్యం చేసిందని, ఇది ఆంధ్రప్రదేశ్‌కు వ్యతిరేక బడ్జెట్ అని తెలిపారు.




మహిళా విద్యార్థి యువజన రంగాలను విస్పర్శించిందని సామాజిక దృక్పథం లేని బడ్జెట్ను కేంద్రం ప్రవేశపెట్టిందని ఆరోపించారు అదా నీ అంబానీ లాంటి కార్పొరేట్ సంస్థలకు వడ్డించిన విస్తరిగా బడ్జెట్ ఉందన్నారు. కేంద్రంతో అంటగాగుతున్న కూటమి ప్రభుత్వం ఆంధ్ర రాష్ట్రం గురించి బడ్జెట్లో ఎక్కడ ప్రస్తావన చేయకపోయినా నోరు మెదకపోవడానికి కారణం ఏంటని ప్రశ్నించారు. అభివృద్ధి కార్మికులు లౌకిక శక్తులు ప్రజాస్వామ్యక వాదులు ఈ బడ్జెట్ను వ్యతిరేకిస్తున్న విషయాన్ని గుర్తుంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. సవరణ బడ్జెట్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఉపాధి హామీ చట్టానికి నిధులు వెచ్చించి సమన్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు కత్తి ఏబు, తాపీ వర్కర్స్ యూనియన్ నాయకులు రమేష్, కె వంశి, పి ఇర్మియ, గుంటి పోలయ్య ,లక్కు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వెలుగు
ePaper
www.shanmukhavelugu.com



# కూటమి ప్రభుత్వం పనితీరుకి నిదర్శనం

## - మారుతున్న రహదారులు - చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

## - వినుకొండ-దొండపాడు తారురోడ్డు పనులు - పరిశీలించిన జీవీ

(షణ్ముఖ వెలుగు, వినుకొండ, ఫిబ్రవరి 5)


రాష్ట్రవ్యాప్తంగా రూపుమారుతున్న రోడ్లే ప్రజలు, ప్రజాసమస్యల పట్ల కూటమి పాలన చిత్తశుద్ధి, పనితీరుకి మరో నిదర్శనమని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. రాష్ట్రంలో గుంతలు కనిపించని రోడ్లే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమన్నారు. అందులో ఇప్పటికే 14వేల కి.మీ. పైగా పూర్తి చేశామని, గుంతలు పూడ్చుతున్నప్పుడు ప్రజల్లో ఆనందం చూస్తుంటే సంతోషంగా ఉందన్నారు. వినుకొండ మండలంలో జరుగుతున్న తారురోడ్డు పనుల్ని బుధవారం ఆయన పరిశీలించారు. వినుకొండ నుంచి కుమ్మరిపాలెం, తిమ్మాయపాలెం, శ్రీరామ్ నగర్, పానకాలపాలెం, దొండపాడు మీదుగా రైతునగర్ వరకు రూ.6.15 కోట్ల నాబార్డు నిధులతో తారురోడ్డు పనులు సాగుతున్నా యి. ఆ వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్న జీవీ.. నాణ్యత విషయంలో రాజీపడొద్దని ఆదేశించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వంలో పూర్తిగా దెబ్బతిన్న 20వేల కి.మీ. రోడ్లను రూ.861 కోట్ల బాగు చేస్తున్నామన్నారు. వినుకొండ నుంచి దొండపాడు రోడ్డు 2018లోనే మం జూరు చేసి పనులు మొదలు పెట్టినా మధ్యలో వైకాపా పాలనలో అంగుళం కూడా ముందుకు కదల్లేదన్నారు. ప్రమాదాలు జరిగి ప్రజలు గాయపడి, ప్రాణాలు కోల్పోయినా పట్టించుకోలేదన్నారు. ప్రస్తుత పనులు 25 రోజుల్లో పూర్తి అవుతుతాయని.. 10 గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం మరింత మెరుగుపడుతుంద న్నారు. గుండ్లకమ్మ వాగు మీద 2వంతెనలు త్వరలో పూర్తి చేస్తామని, ఎక్కడ అవసరమైనా కొత్త రోడ్లు నిర్మిస్తామని తెలిపారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ 26 వేల తీర్మానాలతో రూ.4500కోట్లతో పనులు చేపట్టారని, అభివృద్ధి విప్లవం చూపిస్తున్నారని అన్నారు. రూ.2,287 కోట్లతో సీసీ రోడ్లు, డ్రెయిన్ల అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయన్న జీవీ ఇదే సమయంలో రాష్ట్రానికి 7 నెలల్లో రూ.6లక్షల కోట్ల పెట్టుబడులు రావడం శుభసూచకమన్నారు. వాటిద్వారా 4లక్షల ఉద్యోగాలు రాబోతున్నట్లు తెలిపారు. ఇదే పెట్టుబడులు, పరిశ్రమలు వైకాపా హయాంలో ఎందుకు రాలేదని ప్రశ్నించారు. పైగా ఉన్నవి పక్క రాష్ట్రాలకు తరలిపోయాయి అని, అవన్నీ ప్రజలు ఆలోచించే 93శాతం కూటమి అభ్యర్థుల్ని గెలిపించారన్నారు. ఆ నమ్మకం నిలబెట్టుకు నేలా స్వర్ణాంధ్ర లక్ష్యంతో పనిచేస్తున్నామని. 20లక్షల ఉద్యోగాలు కల్పిస్తున్న చంద్రబాబు ప్రభుత్వానికి అండగా ఉండాలని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి తరఫున పనిచేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలని కోరుతున్నామన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా ప్రజలు విజ్ఞతతో ఆలోచించాలని చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు కోరారు.





# బాపట్ల డిపో పరిధిలోని కొత్త రూట్లలో బస్సులు ఏర్పాటు చేయాలి

## వినతి పత్రాన్ని అందజేసిన బాపట్ల ఎమ్మెల్యే వేగేశన



(షణ్ముఖ వెలుగు, బాపట్ల, ఫిబ్రవరి 5)

బాపట్ల డిపో పరిధిలో కొత్త రూట్లలో బస్సుల ఏర్పాటుకు కృషి చేయాలని రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ రాజు సచివాలయంలో మంత్రి ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి కోరారు. 2022లో కొత్తగా ఏర్పాటైన బాపట్ల జిల్లాకు బాపట్ల జిల్లా కేంద్రంగా మారిందని, అయితే ప్రజల నుంచి డిమాండ్ పెరిగినప్పటికీ జిల్లా హెడ్ క్వార్టర్స్ అంటే బాపట్ల నుంచి స్టేట్ హెడ్ క్వార్టర్స్, ఇతర ముఖ్య ప్రాంతాలకు బస్సుల ఫ్రీక్వెన్సీ, సర్వీసుల ఫ్రీక్వెన్సీని ఇంతవరకు పెంచలేదన్నారు. కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టితో ప్రజలకు మెరుగైన రవాణా సేవలు కల్పించాలని మంత్రి ని ఎమ్మెల్యే కోరారు. రవాణా శాఖ మంత్రి సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఆలపాటి గెలుపు ఖాయం

## ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

## 7న ఆలపాటి నామినేషన్ కార్యక్రమం విజయవంతం చేయాలి



(షణ్ముఖ వెలుగు, వినుకొండ, ఫిబ్రవరి 5)

ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థిగా తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ గెలుపు ఖాయమని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. ఈ రెండు జిల్లాల పట్టభద్రులతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న యువత భవిత కోసం ఆయన గెలుపు అనివార్యమన్నారు. విద్యార్థులు, యువత ఉపాధి, ఉద్యోగ అవకాశాల కోసం కూటమి ప్రభుత్వం తలపెట్టిన కార్యక్రమాలకు ఈ గెలుపు కొత్త ప్రేరణ శక్తిగా మారనుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నెల 7న గుంటూరు కలెక్టరేట్‌లో ఆలపాటి రాజేంద్రప్రసాద్ నామినేషన్ దాఖలు చేస్తున్నారని ఈ కార్యక్రమానికి, వినుకొండ సహా పల్నాడు జిల్లాలోని 7 నియోజకవర్గాల నుంచి తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, పట్టభద్రులు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ఆంజనేయులు పిలుపునిచ్చారు. బుధవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసిన ఆయన ఇన్ని రోజులుగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు కోసం కూటమి నాయకుల సమష్టి కృషి ఆలపాటి నామినేషన్ రోజున స్పష్టంగా కనిపించాలన్నారు. శుక్రవారం ఉదయం 10-12 గంటల మధ్యలో ఆయన నామపత్రాలు దాఖలు చేయనున్నారని వెల్లడించారు.

# మాజీ సైనికులకు కేటాయించిన భూములు పదేళ్లు దాటితే వెంటనే ఎన్ఓసిలు జారీ చేసి ఆదుకోవాలి

## ఎంపీటీసీ తాండ్ర సాంబశివరావు




(షణ్ముఖ వెలుగు, బాపట్ల, ఫిబ్రవరి 5)

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలో మాజీ సైనికులకు కేటాయించిన భూములకు పది సంవత్సరాలు దాటితే ఎన్ఓసి ఇవ్వాలని స్పష్టమైన ప్రభుత్వ ఆదేశాలు ఉన్నప్పటికీ కొన్ని జిల్లాలలో అధికారులు వాటిని పాటించకుండా, మాజీ సైనికులను, మాజీ సైనికుల కుటుంబ సభ్యులను ఇబ్బందులకు గురి చేస్తున్న విధానాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు వన్ స్టేట్ వన్ అసోసియేషన్ యొక్క రాష్ట్ర స్థాయి క్రియాశీలక నాయకులు బాపట్ల జిల్లా మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షులు, ఎంపీటీసీ సభ్యులు తాండ్ర సాంబశివరావు అన్నారు. ముఖ్యంగా విశాఖపట్నం జిల్లాలో ఇలాంటి కేసులు ఎక్కువగా ఉన్నాయి అని తెలియ జేశారు. మాజీ సైనికులకు కేటాయించిన భూములకు సమయానుకూలంగా ఎన్ఓసి పట్టాలు ఇవ్వనందున భూ కబ్జాదారులు ఆక్రమించుకొని మాజీ సైనికులను బెదిరించే కేసులు కూడా తమ దృష్టికి వస్తున్నట్లు తెలియ జేశారు. ప్రస్తుతం మాజీ సైనికులకు సంబంధించిన భూములపై వందల సంఖ్యలో కేసులు నమోదు అయ్యాయని తెలిపారు. చరిత్రను తిరగరాసే విధంగా తొలిసారి మాజీ సైనికులకు న్యాయం చేసే విధంగా మాజీ సైనిక కార్పొరేషన్ ఏర్పాటు చేయుటకు అంగీకరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌లు వెంటనే స్పందించి మాజీ సైనికులకు కేటాయించిన భూములకు ఎన్ ఓ సి పట్టాలులు ఇప్పించ వలసినదిగా రాష్ట్ర మాజీ సైనికుల తరఫున కోరుతున్నట్లు ఎంపీటీసీ తాండ్ర తెలియ జేశారు. వన్ స్టేట్ వన్ అసోసియేషన్ ద్వారా పటిష్ఠమైన రాష్ట్ర కమిటీ ఏర్పడిన తరువాత మాజీ సైనికులకు సంబంధించిన ఇలాంటి క్లిష్టమైన సమస్యలను మాజీ సైనికుల సంక్షేమం కోసం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకు వెళ్లనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మాజీ సైనికులకు కేటాయించిన భూముల విషయంలో సరైన న్యాయం చేస్తారని ఆశాభావం వ్యక్తంచేశారు.

# కాకాణి గోవర్ధన్ రెడ్డి చేసిన మేలును మరిచిపోలేను

## రోజూ లెక్కలు చెబుతూ రూ.1400 కోట్లు ఇచ్చిన నా తోడేరు బ్రోని ఎలా మరిచిపోగలను

## ముత్తుకూరు మండలం వల్లూరు పర్యటనలో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఫిబ్రవరి 5)

సాధారణంగా అందరూ వెంకటేశ్వర సుప్రభాతం విని దినచర్య ప్రారంభిస్తారు. తనకు మాత్రం తన బ్రో తోడేరు రెడ్డి తిట్ల సుప్రభాతంతో రోజు ప్రారంభమవుతుందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఏమో పాపం వారం రోజుల నుంచి తిట్ల దండకం ఆపేసివున్నాడు. తనను తిడుతున్నందుకే ఆయనకు జగనన్న జిల్లా అధ్యక్ష బాధ్యతలు ఇచ్చారు. జిల్లా అధ్యక్షుడయ్యాడు కదా, జిల్లాలో అందర్నీ తిడతాడనుకున్నా, కానీ నా ఒక్కడి పైనే తిట్ల దండకం సాగిస్తున్నాడు. రోజూ సంపాదన లెక్కలు చెబుతూ కాకాణి గోవర్ధన్ రెడ్డి తనకు చేసిన సాయం మరిచిపోలేను. విదేశాల్లో వెయ్యి కోట్ల ఆస్తులిచ్చాడు, ఇసుకలో తన కొడుక్కి రూ.200 కోట్లు ఇచ్చారు. బూడిదలో ఒక రూ.100 కోట్లు, ఇరిగేషన్ పనులు, బ్రాందీషాపుల్లో ఇంకో రూ.100 కోట్లు, అంతా కలిపి రూ.1400 కోట్లు ఇచ్చిన కాకాణిని ఎలా మరిచిపోగలని ఎమ్మెల్యే సోమిరెడ్డి ఎద్దేవా చేశారు.



# వాడీ వేడీగా కౌన్సిల్ సమావేశం

## మేయర్ పోడియన్ని చుట్టుముట్టిన వైసీపీ కార్పొరేటర్‌లు

## ఖబరస్థాన్ అంశంను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్

## కౌన్సిల్ సమావేశాన్ని బహిష్కరించిన వైసిపి సభ్యులు

## అనంతరం పలు అంశాలు ఆమోదం







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 5)

ఒంగోలు నగర పాలక సంస్థ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో జరిగిన ఈ సమావేశానికి డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఒంగోలు, సంతనూతలపాడు ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధన్ రావు, బీఎన్ విజయ్ కుమార్‌తో పాటు అధికార, ప్రతి పక్ష పార్టీలకు చెందిన కార్పొరేటర్లు పాల్గొన్నారు. మొత్తం 29 అంశాలతో కూడిన అజెండాను మేయర్ ప్రవేశ పెట్టారు. వాటిలో ఒకటి రెండు మినహా మిగిలిన అంశాలను సభ్యుల అంగీకారంతో ఆమోదం తెలిపారు. ప్రధానంగా మైనార్టీలకు సంబంధించిన ఖబరస్థాన్ అంశం చర్చకు రాగా అంశంను పూర్తిగా రద్దు చేయాలని వైసిపి కార్పొరేటర్ ఇమ్రాన్ ఖాన్ డిమాండ్ చేయగా తాత్కాలికంగా అంశాన్ని వాయిదా వేశారు. వాటితో ఇతర అజెండాలపై మాట్లాడే అవకాశం తమకు కల్పించడం లేదని వైసిపి ఆగ్రహం వ్యక్తం చేస్తూ మేయర్ పొడియన్ని చుట్టుముట్టారు. దీంతో టిడిపి పార్టీకి చెందిన కార్పొరేటర్లు వారిని అడ్డుకున్నారు. అనంతరం వైసిపి సభ్యులు కౌన్సిల్ సమావేశాన్ని బహిష్కరించారు. అనంతరం జరిగిన అంశాలు సభ్యుల ఆమోదంతో తీర్మానం పొందాయి. ఈ క్రమంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మున్సిపల్ అధికారులు బదులిచ్చారు. ఈ సమావేశాల్లో కమిషనర్ వెంకటేశ్వరరావు ,డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు. అనంతరం నూతనంగా మేయర్ బాధ్యతలు స్వీకరించిన వేమూరి సూర్య నారాయణను ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్, బి ఎన్ విజయ్ కుమార్, ప్రత్యేకంగా అభినందించారు.

# దారి దోపిడి కేసులో ముద్దాయిలకు మూడేళ్లు కఠిన కారాగారా శిక్ష

## రూ.20 వేలు జరిమానా

(షణ్ముఖ వెలుగు, కనిగిరి, ఫిబ్రవరి 5)

2022 సెప్టెంబర్ 3వ తేదీన జరిగిన దారి దోపిడి కేసులో ఇద్దరు ముద్దాయిలకు కేసు విచారణ అనంతరం మూడేళ్లు కఠినకారాగారా జైలు శిక్ష , ఇరవై వేలు జరిమాన విధించారు. వివరాలలోకి వెళితే వాయిదా పద్ధతిలో దుప్పట్లు అమ్ముకొని జీవనం సాగించే మర్రిపూడి మండలం గార్లపేట కు చెందిన వృద్ధులు నామాల వెంకటస్వామి ఊరు- ఊరు దుప్పట్లు అమ్ముకొని వచ్చిన స్వల్ప ఆదాయం ను అవసరానికి ఉపయోగపడతాయని కనిగిరి బ్యాంకులో జమ చేసుకున్నారు. ఇరువురు వృద్ధ దంపతులు కలసి 2022 సెప్టెంబర్ మూడోతేదీన కనిగిరిలోని ఆంధ్ర బ్యాంక్ నందు రూ.3,50,000లు డ్రా చేసి నగదును టి వి ఎస్ మోటారు బైక్ ముందు సంచిలో పెట్టుకొని సాయంత్రం తమ స్వగ్రామముకు బయలుదేరి వెళుతుండగా గార్లపేట రోడ్డులోని వెంకటేశ్వర స్వామి దేవాలయం దాటిన తర్వాత నిర్మానుష ప్రాంతంలో గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు మోటార్ బైక్ పై వచ్చి వారి కళ్ళల్లో కారం కొట్టి వారిపై దాడి చేసి బ్యాంకులో డ్రా చేసిన రూ.3,50,000లు మొత్తాన్ని తీసుకొని ఉడాయించారు. వారు తేరుకొని కనిగిరి పోలీస్ స్టేషన్ కు వచ్చి జరిగిన విషయాన్ని ఫిర్యాదు చేశారు. వెంటనే పోలీసు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి హనుమతునిపాడు మండలం సీతారామపురం గ్రామానికి చెందిన షేక్ సుభాని షేక్ కరీముల్లా గా గుర్తించి పోలీస్ వారు అరెస్ట్ చేసి కనిగిరి కోర్టుకు హాజరుపరిచారు. అనంతరం రెండేళ్లు విచారణ జరిపి ముద్దాయిలపై ఉన్న నేరం రుజువు అవడంతో బుధవారం కనిగిరి కోర్టులో జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జడ్జి కె భరత్ చంద్ర ముద్దాయిలకు మూడేళ్లు కఠినకారాగారా శిక్ష, ఇరవై వేలు జరిమానా విధించారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com

# అష్టోత్తర శత గోపూజ మహోత్సవం










(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 5)

రథ సప్తమి సందర్భంగా ఒంగోలు నగరంలోని మంగమ్మ డిగ్రీ కళాశాల ఆవరణలో అష్టోత్తర శత గోపూజ మహోత్సవం వైభవంగా జరిగింది. విశ్వమాత సోషల్ సర్వీస్ సొసైటీ, వివేకానంద చారిటబుల్ ట్రస్ట్, కే ఎన్ టీ గౌతమ్ ఎడ్యుకేషనల్ సొసైటీ సంయుక్తంగా ఈ కార్యక్రమం నిర్వహించింది. ఒంగోలుతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుండి మహిళలు పెద్ద సంఖ్యలో అష్టోత్తర శత గోపూజ మహోత్సవంలో పాల్గొన్నారు. 108 గోవులకు భక్తి శ్రద్ధలతో గోపూజ చేశారు. గోమాతల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసిన హోమ గుండాల వద్ద వేద పురోహితులు వేద మంత్రోచ్ఛరణ మధ్య యజ్ఞాన్ని జరిపించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో భాగంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకురాలు తమ్మిశెట్టి లక్ష్మి మాట్లాడుతూ గోవును ప్రతి ఒక్కరూ పూజిస్తుంటారని, గోమాత విశిష్టత తెలియచేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గో ఉత్పత్తులను ప్రతి గ్రామంలో వాడే విధంగా చైతన్యం తీసుకువస్తున్నట్లు చెప్పారు. సనాతన ధర్మం ప్రకారం గో ఆధారిత వస్తువులను వాడాలని కోరారు. హైదారాబాద్ కు చెందిన ఎన్ విజన్ ఇన్నోవేషన్ ఫౌండర్ ప్రవీణ మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా గో ఆధారిత ఉత్పత్తులపై ప్రజలకు మరింత అవగాహన కలిగిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా నాయకుడు కంది రవిశంకర్, బిజెపి జిల్లా అధ్యక్షుడు సెగ్గం శ్రీనివాసరావు, నాయకులు పి.వి కృష్ణారెడ్డి, ఒంగోలు నియోజక వర్గ కన్వీనర్ వైసీ యోగయ్య యాదవ్ మహిళా మోర్చా నాయకురాళ్లు విజయరావు, సత్యవతి, పావని, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

## ఒక పార్టీ గుర్తుపై గెలిచి వేరొక పార్టీకి మద్దతు ఇవ్వడం రాజ్యాంగ విరుద్ధం

### డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తిన ఊటుకూరు నాగార్జున

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఫిబ్రవరి 5)



వైసీపీ పార్టీ గుర్తుపై గెలిచి తెలుగుదేశం పార్టీకి మద్దతు ఇవ్వడం రాజ్యాంగ విరుద్ధమని కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. బుధవారం రాంజీ నగర్ లోని ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి కార్యాలయంలో పత్రిక విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. డిప్యూటీ మేయర్‌గా ఉన్న రూప్ కుమార్ యాదవ్ వైఎస్ఆర్సిపి పార్టీ గుర్తుపై గెలిచారన్నారు. ఆయనకు ఏ మాత్రం రాజ్యాంగ విలువలు ఉన్నా పార్టీ గుర్తుపై గెలిచిన పార్టీకి రాజీనామా చేసి వేరొక పార్టీకి పోవాల్సి ఉందన్నారు. అలా కాకుండా వైయస్సార్సీపి పార్టీ గుర్తు పై గెలిచి టిడిపికి మద్దతు ఇవ్వడం ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. బుధవారం రూప్ నాది యాదవ్ పత్రిక విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి తాము తమ వార్డులలో అభివృద్ధి చేసేందుకు అధికార పార్టీకి మద్దతు ఇచ్చామని తెలపడం దెయ్యాలు వేదాలు అల్లినట్టుందన్నారు. తాము పార్టీ తరపున ఈ విషయంపై కోర్టును ఆశ్రయిస్తామన్నారు. కోర్టులో తమకు న్యాయం జరుగుతుందన్న ఆశాభవం వ్యక్తపరిచారు. విప్ సైతం దిక్కరించి వైఎస్ఆర్సిపి కార్పొరేటర్లు తెలుగుదేశం పార్టీకి మద్దతు ఇవ్వడం వీరి అవివేకానికి నిదర్శనం అన్నారు. ఎంతో అనుభవం ఉన్న రూప్ కుమార్ యాదవ్ తెలుగుదేశం పార్టీకి మద్దతు ఇవ్వడం ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రజలు వారికి ఆయా వార్డుల్లో బుద్ధి చెప్పారని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కార్యదర్శి యన్ యువరాజును కలిసిన దామచర్ల సత్య



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 5)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మారిటైం బోర్డ్ చైర్మన్ దామచర్ల సత్య ప్రభుత్వ కార్యదర్శి యన్ యువరాజు (పరిశ్రమలు, వాణిజ్య, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ)ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

## ఒంగోలు ఫుడ్ ఇన్స్పెక్టర్‌గా మన్నం ప్రమోద్ కుమార్




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 5)

ఒంగోలు ఫుడ్ ఇన్స్పెక్టర్‌గా మన్నం ప్రమోద్ కుమార్ నియమితులయ్యారు, మార్కాపురం నియోజకవర్గం పొదిలి మండలంలో ఎఫ్ఐగా బాధ్యతలు చేపడుతున్న ఆయనను ఒంగోలు బదిలీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న వి.శ్రీనివాసరావును పొదిలి బదిలీ చేశారు. బదిలీపై ఒంగోలు వచ్చిన మనం ప్రమోద్ కుమార్ ఎఫ్ఐగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

## ఒంగోలు పట్టణానికి పూర్వవైభవం తీసుకువచ్చేలా కృషి

### ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 5)

ఒంగోలు పట్టణానికి పూర్వవైభవం తీసుకువచ్చేలా కృషి చేస్తున్నామని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు అన్నారు. నగర పాలక సంస్థ కౌన్సిల్ డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొన్న దామచర్ల మాట్లాడుతూ గడిచిన 7 నెలల కాలంలో ఒంగోలు పట్టణంలో పారిశుధ్యం, రోడ్లు విస్తరణ, కాలువల పూడికతీత, సుందరీకరణ, పచ్చదనం వంటి కార్యక్రమాలతో అభివృధి చేస్తున్నామని తెలిపారు. గడిచిన ఐదు సంవత్సరాలు ఒంగోలు పట్టణంలో అభివృధి పడక ఎక్కిందని ఆరోపించారు. ఇప్పటికే కొన్ని డివిజన్లు నందు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామని త్వరలోనే అన్ని డివిజన్ల నందు అభివృధి కార్యక్రమాలు చేపడతామని తెలియజేశారు. రానున్న 6 నెలల కాలంలో ఒంగోలు నగరాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని దామచర్ల పేర్కొన్నారు. పారిశుధ్యం పై నిరంతర పర్యవేక్షణ వుండాలని అన్నారు. ఉదయం 5 నుంచి రాత్రి 10 గంటల లోపే నగరంలో నీటిని సరఫరా చేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. రానున్న వేసవిని దృష్టిలో వుంచుకొని నీటి కొరత లేకుండా చూడాలని ఆయన ఆదేశించారు. సంతనూతపాడు ఎమ్మెల్యే విజయ్ కుమార్ మాట్లాడుతూ ఒంగోలు కార్పొరేషన్ పరిధిలో ఉన్న పేర్ణమిట్ట చెరువును సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌గా మార్చాలని ఆయన కోరారు.






## టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో వేగంగా సి సి రోడ్ల నిర్మాణం



(షణ్ముఖ వెలుగు, దొరవారిసత్రం, ఫిబ్రవరి 5)

తిరుపతి జిల్లా దొరవారి సత్రం మండలం తల్లంపాడు సచివాలయం పరిధిలో ఉన్న మోదుగులపాలెం గ్రామ పంచాయతీలో ఎస్సీ కాలనీ నందు ఐదు లక్షలకు టీడీపీ స్థానిక నాయకులు నేతృత్వంలో సి.సి రోడ్ల నిర్మాణం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. అధికారులు రోడ్ల నిర్మాణం పనులను తనిఖీ చేశారు. సీసీ రోడ్లు వేగంగా, నాణ్యతగా వేయిస్తున్న టిడిపి స్థానిక నాయకులు సచివాలయ ఇంజినీర్ బండి సమూచిత, అధికారులను అభినందించారు.